వార్త

ఆదివారం

15 సెప్టెంబరు, 2024

'జ్వర' ఘోష

తారాతీరం

'స్పిరిట్'లో ద్విపాత్రాభినయం?

దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ 'స్పిరిట్' సినిమా చేయబోతున్నాడు. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం సందీప్‌రెడ్డి ఈ సినిమా స్క్రిప్ట్ పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్ర కథ ప్రకారం ప్రభాస్ ద్విపాత్రాభినయం చేయనున్నట్లు సమాచారం. ప్రేక్షకులు ప్రభాస్ నుంచి ఏదైతే కోరుకుంటున్నారో అది ఈ సినిమాలో ఉంటుందట. ప్రస్తుతం ప్రభాస్ 'రాజాసాబ్' సినిమా పూర్తి చేసే పనిలో ఉన్నాడు.

షూటింగ్ దశలో 'కూలీ'

కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. జ్ఞానవేల్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న 'వేట్టైయన్' ఒకటి; మరో చిత్రం దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో చేస్తున్న భారీ చిత్రం 'కూలీ రెండోది. కూలీ చిత్రాన్ని లోకేష్ తన మార్క్ సాలిడ్ క్యాస్టింగ్‌తో ప్లాన్ చేస్తుండగా సౌత్ ఇండియా ప్రేక్షకుల్లో ఓ రేంజ్‌లో హైప్ నెలకొంది. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానున్నట్లు సమాచారం. ఇందులో కింగ్ నాగార్జున, శృతిహాసన్, ఉపేంద్ర మొదలైనవారు నటిస్తున్నారు. సన్ పిక్చర్స్ నిర్మాణం వహిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు.

'హిట్ 3' వేసవిలో విడుదల?

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ నేచురల్ స్టార్ నాని వరస హిట్స్‌తో లేటెస్ట్‌గా 'సరిపోదా శనివారం'తో కలిపి హ్యాట్రిక్ విజయాలు అందుకొని అదరగొట్టిన నాని ఇప్పుడు మరో కొత్త ప్రాజెక్ట్‌తో రాబోతున్నాడు. యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు శైలేష్ కొలను కాంబినేషన్‌లో చేస్తున్న మాస్ పోలీస్ అండ్ యాక్షన్ డ్రామా 'హిట్ 3' చిత్రం.

ఈ సినిమాని వచ్చే ఏడాది మే 1వ తేదీన గ్రాండ్‌గా విడుదల చేయన్నుట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తుండగా, యునానిమస్ ప్రొడక్షన్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

ఆదివారం వార్త

15 సెప్టెంబరు, 2024

మంచి ముత్యాలు

అభినందించడం అనే ఏకైక కళ
మాత్రమే నాకు తెలుసు.

- లార్డ్ బైరన్

విషయ విశేషం

జలపాతాల్లో హాయిగా.... 4

'సంఘీ'భావం....5

ఆక్రమణలతోనే అనర్థాలు

కవర్ స్టోరీ..6

'జ్వర' ఘోష

'ఫైన్' యాపిల్!....10

ఈవారం కవిత్వం..12

ఓజోన్ రక్షతి రక్షితః

సూర్యాస్తమయం లేని దేశాలు...14

సాధన చేస్తే గణితం....18

కథ.. 20

సార్థకత

చమత్కార శ్లోకాలు

కోటలకు కోట కొండవీటి.....25

బకాయిలు వసూలు.... 29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

తాజా వార్తలు

గాలి నుంచి వెన్న తీయవచ్చు!

'తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు.' అన్న సుభాషితం వినే ఉంటారు. ఇసుక నుంచి నూనె తీయొచ్చేమోకానీ మూర్ఖులని మెప్పించలేం అనే సందర్భంలో ఈ మాట వాడుంటాడు భర్తృహరి. 'ఇసుకదేం కర్మ..మేం ఏకంగా గాలి నుంచే వెన్న తీయగలం' అంటోంది అమెరికాకి చెందిన సంస్థ ఒకటి. ఇదేమీ గాలి మేడలు కట్టడం కాదండోయ్..దీని వెనుక సైన్సు ఉంది. ముఖ్యంగా రసాయనశాస్త్ర ప్రయోగాలు ఉన్నాయి. సావర్ అనే సంస్థ ఈ ప్రయోగాలని చేసి విజయం సాధించింది. గాలిలోని కార్బన్ డయాక్సైడ్‌ని వేడి చేసి దానికి హైడ్రోజన్‌ని కలుపుతారట. ఆ రెండూ కలిసిన వాయువుకి ఆక్సిజన్‌ని చేరుస్తూ రసాయబంధాలని నిర్మిస్తే..వెన్న రెడీ అయిపోతుందని చెబుతోంది సావర్ సంస్థ. అన్నట్లు..ఆ వెన్న ఏకంగా ప్రపంచ కుబేరుడు బిల్‌గేట్స్‌నీ మెప్పించింది. తన గేట్స్ ఫౌండేషన్ ద్వారా ఆ సంస్థ అభివృద్ధికి సాయం కూడా చేస్తున్నాడాయన.

బ్రెయిన్ వాషింగ్‌కి మందు

మన శరీరంలో పేరుకున్న వ్యర్థాలు ఎప్పటికప్పుడు బయటకు వెళ్లాలి. లేకపోతే ప్రమాదంలో పడతాం! అలాంటి శుభ్రతా వ్యవస్థే మన మెదడులో కూడా ఉంటుంది. దీన్ని గ్లింఫాటిక్ వ్యవస్థ అంటారు. ఇందులోని సెరిబ్రోస్పైనల్‌ఫ్లుయిడ్ (సీఎస్ఎఫ్) అనే రసాయనం మెదడులోని వ్యర్థకణాలని ఎప్పటికప్పుడు బయటకు నెట్టేస్తుంది. ఈ ప్రక్రియని బ్రెయిన్ వాషింగ్ అంటారు శాస్త్రవేత్తలు. అయితే వయసు పెరిగేకొద్దీ ఈ వ్యవస్థ క్రమంగా మందగిస్తుంది. అల్జీమర్స్, పార్కిన్‌సన్స్ వంటి వ్యాధులకి ఇదే మూలం. ఆ వ్యవస్థ మందగించకుండా ఉండేందుకే ఇప్పుడో కొత్త ఔషధాన్ని రూపొందించారు యూనివర్సిటీ ఆఫ్ రోచెస్టర్ శాస్త్రవేత్తలు. ఇప్పటిదాకా ఈ వ్యాధులకి కారణమయ్యే ఇతర వ్యవస్థలపైన మందులు తయారు చేశారు కానీ 'బ్రెయిన్ వాషింగ్' కోసం ప్రత్యేకంగా ఓ ఔషధాన్ని రూపొందించడం ఇదే మొదటిసారి. వయసు పెరిగే కొద్దీ గ్లింఫాటిక్ వ్యవస్థలోని సీఎస్ఎఫ్ రసాయాన్ని తీసుకొచ్చే సన్నని పంపుల్లాంటి రక్తనాళాల్లో చురుకుదనం తగ్గుతుందట. ఈ తాజా మందు ఆ నాళాలని మళ్లీ క్రియాశీలంగా మారుస్తుందట. ఆ రకంగా ఇది మన మెదడు వయసుని తగ్గించేస్తుందనే చెబుతున్నారు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



జలపాతాల్లో హాయిగా..

ఇంట్లోకి స్వాగతం పలికే గుమ్మం దగ్గర్నుంచి ఆహ్లాదాన్ని ఇచ్చే బాల్కనీ వరకూ ప్రతిదీ ఎప్పటికప్పుడు సరికొత్త సొబగులు అద్దుకుని వస్తుంటే ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఉండే స్నానాల గది మాత్రం మామూలుగా ఎందుకు ఉండాలి. ఆ ఆలోచనతోనే ప్రస్తుతం చాలామంది ఇంటిరియల్ అందాల్లో షవర్ రూముల్నీ చేర్చుతున్నారు.

విశాలమైన బాత్ టబ్బులూ, నయా షవర్లతో కొత్త లుక్కును తెచ్చుకుంటున్నారు. వైవిధ్యాన్ని కోరుకునే కొంతమంది గృహిణులైతే మెరుపుల టైళ్ల మీద పచ్చటి మొక్కల్నీ పెట్టేసి సరికొత్త దృశ్యాల్ని సృష్టిస్తున్నారు. ఇలాంటివాటిని ఇంకాస్త ఆకట్టుకోవడానికే ఇప్పుడు ఈ ఎపోక్సీ నేచర్ షవర్స్ వచ్చేశాయి. ఎంచుకున్న థీమ్‌కి తగ్గట్టు అందులోని చెట్లనీ, రాళ్లనీ, జలపాతాల్నీ నిజమైన వాటిలా కనిపించేలా రూపొందిస్తున్నారు.



'సంఘీ' భావం

ఆక్రమణలతోనే అనర్థాలు

అధికారం అండతో ఇష్టారాజ్యంగా ఆక్రమణలు కొనసాగించి నిర్మించిన భారీ కట్టడాల వల్ల ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఖమ్మంలోని మున్నేరు, విజయవాడలోని బుడమేరు వాగుల ఉధృతికి భారీ నష్టం వాటిల్లింది. ఈ నష్టాన్ని పరిశీలిస్తే ఆక్రమణలు ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. అంతే కాదు తరచూ హైదరాబాద్, వరంగల్, విజయవాడ వంటి అనేక నగరాలు ముంపునకు గురికావడానికి చెరువు కట్టలను ఇష్టారాజ్యంగా ఆక్రమించి నీటి ప్రవాహానికి ఆడ్డుకట్ట వేయడమే కారణంగా ఉంది. కేరళలో వయానాడ్ దుర్ఘటనకు కూడా ఆక్రమణలే కారణంగా నిలిచాయి. నగరాల్లో ఆక్రమణలు చేస్తే రాకపోకలకు మాత్రమే ఇబ్బందులు కలుగుతాయి. కాని నగర శివార్లలో చెరువు కట్టలను, పరివాహక ప్రాంతాలను, నదుల ఒడ్డులను ఆక్రమించి చేస్తున్న కట్టడాల వల్ల ఆయా ప్రాంతవాసులకు భారీ నష్టాన్ని కలిగిస్తాయి. పెద్దసంఖ్యలో ఆస్థి, ప్రాణ నష్టం కలుగుతోంది. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో హైడ్రా కూల్చివేతలు కొనసాగిస్తున్న తరుణంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించడం, ఆక్రమణ వల్ల కలుగుతున్న నష్టం ఏ స్థాయిలో ఉందో వెలుగుచూసింది. కొన్ని ప్రాంతాల్లో ఏకంగా చెరువులను మూసివేసి భవనాలు నిర్మించారు. విచిత్రం ఏమిటంటే వీటికి అధికారులు కొమ్ముకాసి అన్ని అనుమతులు ఇచ్చారు. హైదరాబాద్‌లో హైడ్రా నోటీసులు ఇచ్చిన భవంతులను, కట్టడాలను పరిశీలిస్తే ఎక్కువ శాతం స్థానిక సంస్థల నుంచి అన్ని అనుమతులు వాటికి ఉన్నాయి. ద్యుత్, మంచినీరు, రోడ్లు వంటి అనేక సౌకర్యాలను ప్రభుత్వ శాఖలు కల్పించాయి. బ్యాంకులు రుణాలు కూడా ఇచ్చాయి. ఇంత జరుగుతున్నా చెరువు కబ్జా గురించి ఏ ఒక్క అధికారి కూడా ఇప్పటి వరకు అడ్డు చెప్పిన దాఖలు లేవు. అధికారి తప్పిదమా లేక బడాబాబులు వారిపై ఒత్తిడి తీసుకువచ్చి అనుమతులు ఇప్పించారా అన్న విషయం పక్కన పెడితే ప్రస్తుతం జరుగుతున్న నష్టానికి మాత్రం సామాన్య ప్రజానీకం బలిపశువులు కావాల్సి వస్తోంది. పది సెంటీమీటర్ల వర్షం కురిస్తే చాలు హైదరాబాద్‌లో చాలా ప్రాంతాలు చెరువుల్లా మారతాయి. ఇక కొన్ని రోడ్లపై నీటి ప్రవాహం ధాటికి కార్లు, ద్విచక్రవాహనాలు కొట్టుకుపోతున్న ఘటనలు ఇటీవల కాలంలో తరచూ కనిపిస్తున్నాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు ఎగువ ప్రాంతం నుంచి నీరు ప్రవహించడానికి ప్రకృతి సిద్ధంగా కొన్ని కాలువలు, చెరువులు ఏర్పడతాయి. అక్రమ నిర్మాణాలతో వీటికి అడ్డుకట్ట వేయడంతో నీరు ప్రవహించేందుకు వేరే మార్గాలు అన్వేషిస్తుంది. అడ్డు వచ్చిన కట్టడాలను, కాలనీలను, రోడ్లను, నివాసప్రాంతాలను ముంచెత్తుతూ ముందుకు సాగుతుంది. ఈ సమయంలో ఊహించని విధంగా నీరు ముంచెత్తినప్పుడు భారీగా ప్రాణ, ఆస్థి నష్టం సంభవిస్తుంది. వయనాడ్ దుర్ఘటనలో సుమారు వెయ్యి మంది మృతి చెందారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 50 మంది మృతి చెందారు. అంతకు రెట్టింపు మంది మృతి చెంది ఉంటారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. చెరువులు, నాలాలు కబ్జా చేసిన బడాబాబులు తెలివిగా వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటారు. మోసపోయేది, నష్టపోయేది మాత్రం సామాన్య ప్రజానీకం. మనం చెరువులోకి వెళితే చెరువు మన ఇంటిలోకి వస్తుందని పెద్దలు చెప్పేవారు. ప్రస్తుతం అదే జరుగుతోంది. 2020 అక్టోబర్‌లో గంట వ్యవధిలో పది సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఈమాత్రం దానికే హైదరాబాద్ నగరం చిగురుటాకులా వణికిపోయింది. అనేక కాలనీలు జలమయం అయ్యాయి. పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం కలిగింది. చెరువులు, నాలాలు కబ్జాలకు గురికావడంతో మోస్తరు వర్షానికే పీడకలగా మారిపోతోంది. ఒకసారి విపత్తు జరిగితే నష్టం కలుగుతుంది. వర్షాలు, తుపానులు, వరదలు రావడం సర్వసాధారణం. భూమి ఏర్పడినప్పటి నుంచిఇవి కొనసాగుతూనే ఉన్నాయి. దశాబ్దం క్రితం ముంపునకు గురికాని హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, విజయవాడ నగరాలు ఇప్పుడు ఎందుకు సమస్యను ఎదుర్కొంటున్నాయన్న విషయంపై దృష్టి సారించాలి. నష్టం కలిగిన వెంటనే లోతుగా పరిశీలన జరిపి వాటి పరిష్కారానికి కృషి చేయాలి. ఒత్తిడిలకు లొంగి అలాంటి చర్యలు తీసుకోకపోతే మళ్లీ మళ్లీ అదే నష్టం కొనసాగుతుంది. ఇప్పటికైనా రెండు తెలుగు రాష్ట్రాలు చెరువులను రక్షించుకోవడానికి పటిష్టమైన ప్రణాళికలు సిద్ధం చేయాలి. చెరువులు, నదీపరివాహక ప్రాంతాలను మరోసారి మార్కింగ్ చేసి ఆయా ప్రాంతాల్లోని స్థానిక సంస్థలకు అప్పగించాలి. ఈ ప్రాంతాల్లో ఆక్రమణలు జరిగితే కఠినంగా చర్యలు తీసుకోవాలి. దీనివల్ల ముంపు సమస్య నుంచి బయట పడటమే కాకుండా భూగర్భ జలాలు అందుబాటులోకి వస్తాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మరిన్ని చెరువులు, కుంటలు తవ్వవలసింది పోయి ఉన్న వాటిని తొలగించడం వల్ల కలిగేఅనర్థం స్థాయిఅధికంగా ఉంటుంది. ఒకప్పుడు హైదరాబాద్‌ను చెరువుల నగరంగా పిలిచేవారు. దుర్గం చెరువు, సున్నం చెరువు, పెద్ద చెరువు, ఫిర్జాదీగూడ చెరువు, దామెర చెరువు, గంగారం పెద్ద చెరువు, బోయిన్ చెరువు, అంబీర్‌చెరువు, గోసాయికుంట చెరువు, హస్మత్‌పేట బావురుడ, మేడికుంట, నల్లచెరువు, పాత బస్తీలో తలాబ్ వంటిఅనేక చెరువులు ప్రస్తుతం నామమాత్రంగా ఉన్నాయి. అదేవిధంగా వరంగల్, ఖమ్మం పరిసరాల్లో గతంలో ఉన్న అనేక చెరువులు కనిపించకుండాపోయాయి. ఆక్రమణలకు పాల్పడిన వారిని, సహకరించిన అధికారులపైనా కఠిన చర్యలు తీసుకుంటే ప్రస్తుతం మిగిలిన ఉన్న చెరువులు, కుంటలను అయినా కాపాడుకునే అవకాశం కలుగుతుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

'జ్వర' ఘోష

కవర్‌స్టోరీ

డాక్టర్ కె. ఉమాదేవి

ప్రస్తుతం అధికంగా వర్షాలు కురుస్తున్నాయి. జూన్, జులైలో పెద్దగా వర్షాలు కురవలేదు కానీ, ఆగస్టు నెల నుంచి వర్షాలు క్రమంగా పెరుగుతున్నాయి. ఇది వర్షాకాలం కాబట్టి వర్షాలు కురుస్తాయి. అయితే వర్షాలకు తోడు అల్ప పీడన ప్రభావంతో గత కొన్నిరోజులుగా కావాల్సిన దానికంటే అధికంగా వర్షాలు కురుస్తున్నాయి. ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ లోను, తెలంగాణలో కొన్ని జిల్లాలో విపరీతంగా వర్షాలు పడుతున్నాయి. దేశంలో అనేక రాష్ట్రాలలో అధిక వర్షాలు కురుస్తున్నాయి. అల్పపీడనంతో ఇంకా వర్షాలు భారీ నుంచి అతిభారీగా కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటిస్తున్నది. అధిక వర్షాలు, చల్లటి వాతావరణం వల్ల అంటువ్యాధులు, విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇన్‌ఫ్లుయెంజా, రైనోవైరస్, డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్, చికెన్‌గున్యా వైరస్, ఎబోలా వైరస్, జికావైరస్, వెస్ట్‌నైల్ వైరస్‌లతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. అసుపత్రులు జ్వరాల రోగులతో నిండిపోతున్నాయి. ప్రత్యేకంగా చంటిపిల్లలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఈ వ్యాధిబారిన పడుతున్నారు. అంటురోగాలు కూడా విస్తరిస్తున్నాయి. ఈ సీజన్‌లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. లేకపోతే ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది. జ్వరాలు, వాటి రకాలు, వ్యాధికి కారణాలు, నివారణ చర్యల గురించి తెలుసుకుందాం.

వైరస్‌లు కంటికి కనిపించని సూక్ష్మజీవులు. భూమిపై 380 (ట్రిలియన్స్) దాకా వైరస్‌లున్నాయి. వాటిలో దాదాపు వెయ్యి రకాల వైరస్‌లు మనుషుల్ని ఇన్ఫెక్ట్ చేస్తాయి. వీటినే హ్యూమన్ వైరస్‌లు అంటారని డాక్టర్ షాపిరా తెలిపారు. మొదట 1892లో రష్యా సైంటిస్ట్ అయిన డెమిట్రీ ఐవాన్‌స్కీ వైరస్‌ల్ని ప్రత్యేకమైన సూక్ష్మజీవులుగా గుర్తించారు. వీటికి మార్టినస్ బైజిరిక్ 'వైరస్' అని పేరు పెట్టారు.

వైరస్ అనేది లాటిన్ పదం. దీని అర్థం తెలికైన విషం. వైరస్‌ల గురించిన శాస్త్రాన్ని 'వైరాలజీ' అంటారు. 1931లో జర్మనీ సైంటిస్ట్ అయిన ఎర్నస్ట్ రస్కా, మాక్స్‌నోల్ ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్ ద్వారా వైరస్‌ల సైజ్(20ఎమ్–750ఎన్ఎమ్) వైరస్‌ల ఆకారం(రాడ్స్–జంతువుల వైరస్, ఫిలమెంట్స్–మొక్కల వైరస్, గుండ్రంగా–హ్యూమన్ వైరస్), వైరస్‌ల నిర్మాణం, పనితీరుని గుర్తించారు.

వైరస్ నిర్మాణం మూడు భాగాలుగా ఉంటుంది. తలభాగం లేదా క్యాప్సిడ్‌లో డిఎన్ఎ/లన్ఎన్ఎ జెనెటిక్ మెటీరియల్ ఉంటుంది. ఇది ప్రొటీన్/కొవ్వు/గ్లైకోప్రొటీన్‌తో చుట్టబడి ఉంటుంది. వైరస్ తోకభాగం ప్రొటీన్‌తో నిర్మించబడి కణాల్ని అతుక్కోవడానికి ఉపయోగపడుతుంది. వైరస్ అణువుల్ని 'విరియన్' అంటారు. శరీరంలో హాని కలిగించే వైరస్ వృద్ధినే 'వైరల్ ఇన్ఫెక్షన్' అంటారు. దీనివల్ల కణాల డామేజ్, కణజాల విచ్ఛిన్నం, ఇమ్యూన్ రెస్పాన్స్‌ని బట్టి వైరస్‌లు ఎనర్జీ పారసైట్‌గా మారి కొత్త వైరస్‌ల్ని ఉత్పత్తి చేయడం వల్ల వ్యాధిలక్షణాలు కన్పించి వైరల్ డిసీజెస్‌గా బహిర్గతమవుతాయి.

ఇది చిన్న జలుబు వంటి వ్యాధుల నుండి హెచ్‌ఐవి, కేన్సర్, కోవిడ్19 వంటి తీవ్రమైన ఇన్ఫెక్షవస్ వ్యాధుల దాకా ఉంటాయి. వైరస్ వల్ల కలిగే ఇన్ఫెక్షన్ వల్ల శరీర ఉష్ణోగ్రత పెరగడాన్ని వైరల్ ఫీవర్ అంటారు. వైరల్ ఆంటిజెన్స్ శరీరం చేసే పోరాటం వల్ల పైరోజెన్స్ ఉత్పత్తి అయి జ్వరం వస్తుంది. ఇది అనేక రకాలైన వైరస్‌ల వల్ల వస్తుంది. ఇవి 1-4 రోజులుంటాయి. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి వైరల్ ఫీవర్స్‌లో జ్వరం -10-14 రోజులుంటుంది.

వ్యాప్తి: వైరల్ ఇన్ఫెక్షన్స్ ఉన్నవారితో సన్నిహితంగా మెలిగినా, గాలి పీల్చడం ద్వారా దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, మాట్లాడేటప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా జలుబు, ఇన్‌ఫ్లుయెంజా, మీజిల్స్, మంప్స్, రూబెల్లా వైరస్.

అపరిశుభ్రత (భ్రత ఫ్రీకోబరల్) ద్వారా: పోలియో, ఎకో, రోటావైరస్ కలుషితమైన నీరు, ఆహారం ద్వారా: కాక్సకీ,

హెపటైటిస్, ఎ వైరస్.
లైంగిక సంపర్కం ద్వారా: హెర్పిస్, హెపటైటిస్ బి, హెచ్‌పివి, హెచ్ఐవి
క్రిమికీటకాల వల్ల: ఎల్లో, డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా
జంతువులు కొరకడం వల్ల: రేబిస్
సూదులు పంచుకోవడం వల్ల: హెపటైటిస్ బి, ఎయిడ్స్
ట్రాన్స్‌ప్లాసెంటల్ ద్వారా: రూబెల్లా, సైటోమెగల్, హెచ్ఐవి వైరస్
ఇవే గాకుండా నోటిస్రావాలు, ఎంగిలి చేసిన, అపరిశుభ్రత, వాతావరణంలో మార్పుల వల్ల, పేదరికం సరైన వైద్య సదుపాయం సకాలంలో అందకపోవడం వల్లకూడా వైరల్ ఫీవర్స్ వ్యాపిస్తాయి.
ఇవి చాలావరకు అంటువ్యాధులేనని చెప్పవచ్చు. ఇన్ఫెక్షన్ సోకిన తర్వాత వైరస్ ఫీవర్ అభివృద్ధి చెందడానికి 16-48 గంటలు పడితే, మరికొన్ని వైరల్ ఫీవర్స్‌లో 21 రోజులు పట్టవచ్చు.

కారణాలు:

శరీరంపై దాడి చేసే వైరస్ రకాన్ని బట్టి వైరల్ ఫీవర్స్‌కి కారణాలుంటాయి. జ్వరం తీవ్రం, సూక్ష్మజీవుల విరులెన్స్, సంక్రమణకు హోస్ట్ ప్రతిస్పందనపై ఆధారపడి ఉంటుంది. కారణాల్ని బట్టి వైరల్ ఫీవర్స్ రెండు రకాలు.
1. అక్యూట్ వైరల్ ఫీవర్స్: ఇవి అకస్మాత్తుగా, తీవ్రంగా వచ్చి దానంతట అవే 1-4 రోజుల్లోపల తగ్గిపోతాయి. ఇవి ఎక్కువగా వర్షాకాలంలో వస్తాయి. అన్ని వయస్సుల వారికి వచ్చే అవకాశముంది. ఉదా: ఇన్‌ఫ్లుయెంజా, రైనోవైరస్, డెంగ్యూ, చికెన్‌గున్యా వైరస్, ఎబోలా వైరస్, జికావైరస్, వెస్ట్‌నైల్ వైరస్‌లు ముఖ్యమైనవి.
2. క్రానిక్ వైరల్ ఫీవర్స్: ఇవి నిదానంగా వచ్చి 10-14 రోజుల్లో తగ్గిపోతాయి. ఇది పిల్లల్లో, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా వున్నవారిలో కన్పిస్తుంది. ఉదా: నోరోవైరస్, రోటావైరస్, ఆస్ట్రోవైరస్, హెపటైటిస్ వైరస్(లివర్ డిసీజ్), పారాసైటిక్ వైరస్ వల్ల (మలేరియా, లిష్మానియాసిస్నో ఎప్స్టయిన్ బార్ వైరస్ వల్ల ఇన్ఫెక్షువస్ మోనో న్యూక్లియోసిస్ వస్తుంది. సైటోమెగలో వైరస్ ఎండమిక్ ఫంగై వల్ల మైకోసిస్ వంటి వైరల్ ఫీవర్స్ వస్తాయి.
రకాలు:
1) రెస్పిరేటరీ వైరల్ ఇన్ఫెక్షన్స్ వల్ల వచ్చే జ్వరాలు: ఇవి ముక్కు, గొంతు ద్వారా వెలువడే తుంపర్ల వల్ల తాకినా, గాలి పీల్చడం వల్ల వస్తాయి.
ఎ) రైనోవైరస్: 200 రకాల జలుబు కారక వైరస్‌ల వల్ల జలుబు వస్తుంది.

బి) సీజనల్ ఇన్‌ఫ్లెయెంజా వైరస్: యుఎస్‌లో 5-20 శాతం మంది అంటే 2 లక్షల మంది ప్రతి సంవత్సరం బాధ పడుతుంటారు.
సి) రెస్పిరేటరీ సైనసైటియల్ వైరస్(ఎఎస్‌వి): దీనివల్ల పిల్లల్లో, వృద్ధుల్లో జలుబు, న్యూమోనియా/బ్రాంఖియోలైటిస్ వ్యాధులొస్తాయి.
డి) సార్స్, మెర్స్, కొవిడ్ 19 వైరస్: ఈ వైరస్‌ల వల్ల దగ్గు, జ్వరం, న్యూమోనియా, (బ్రీతింగ్ ప్రాబ్లమ్స్ వంటి లక్షణాలుంటాయి.
ఇ) ఎడినో వైరస్ ఇన్ఫెక్షన్స్.
ఎఫ్) పారా ఇన్‌ఫ్లుయెంజా వైరస్ ఇన్ఫెక్షన్స్.
2) జీర్ణకోశ వైరల్ ఎన్ఫెక్షన్స్ వైరల్ ఫుడ్ పాయిజనింగ్.
ఎ) హైపటైటిస్ ఎ వైరస్: కామెర్లు, హెపటైటిస్
బి) నోరోవైరస్
సి) రోటా వైరస్
డి) ఎడినో వైరస్
ఇ) ఆస్ట్రోవైరస్
జీర్ణకోశ ఇన్ఫెక్షన్స్‌తో బాధపడేవారు తాకడం, అపరిశుభ్రమైన చేతులు, షవర్స్, స్విమ్మింగ్ పూల్స్, రోగి స్రావాలు, వస్తువులు, టవల్స్ వాడడం వ్యాపిస్తాయి. వీటినే స్టమక్ ఫ్లూ/స్టమక్ వైరస్ అని అంటారు.
3) చర్మ సంబంధమైన వైరల్ ఇన్ఫెక్షన్స్(ఎగ్జాథిమాటస్):
ఎ) మొలస్కమ్ కాంటాజియోసమ్: 1-10 సంవత్సరాల పిల్లల్లో చిన్న పొక్కులు గుంపుగా వచ్చి 6-12 నెలల్లో తగ్గుతాయి.
బి) హెర్పిస్ సింప్లెక్స్ హెచ్ఎస్‌వి: కలుషిత ఆహారం, నీరు, లాలాజలం, తాకడం, కిస్సింగ్ వల్ల యు.ఎస్‌లో 85 శాతం కోల్డ్ సోర్స్ వస్తాయి.
సి) వెరిసెల్లా జోస్టర్ వైరస్(వి2వి) దీని వల్ల దురదతో కూడిన నీటిపొక్కులు, నీరసం, జ్వరం, ఒళ్లునొప్పులతో చికెన్‌గున్యా, పెద్దమ్మవారు, మీజిల్స్ ఇన్ఫెక్షన్స్‌లో వస్తాయి.
డి) పులిపిర్లు:
జెనిటల్ పార్ట్స్‌ని తాకడం, రోగిటవల్స్, వస్తువుల వల్ల వ్యాపిస్తాయి. వీటినే క్యుటేనియస్ వైరల్ ఇన్ఫెక్షన్స్ అంటారు.
4) హెపాటిక్ వైరల్ ఇన్ఫెక్షన్స్:
వీటినే సెక్సువల్ ట్రాన్స్‌మిటెడ్ వైరల్ ఇన్ఫెక్షన్స్ అని అంటారు.
ఎ) హెపటైటిస్ ఎ,బి,సి,డి,ఇ వల్ల కాలేయం వాపు వచ్చి కామెర్ల వస్తాయి.
బి) హ్యూమన్ పాపిల్లోమా వైరస్(హెచ్‌పివి): దీనివల్ల పులిపిర్లు సర్వైకల్ కేన్సర్ వస్తుంది.
సి) జెనిటల్ హెర్పిస్ హెచ్ఎస్‌వి2.
డి) జెనిటల్ హెర్పిస్ హెచ్ఎస్‌వి2.

5) హెమరేజిక్ వైరల్ ఇన్ఫెక్షన్స్: ఇవి టిక్స్, దోమలు వంటి క్రిమికీటకాలు, రక్తం, రోగిస్రావాలు, ఎలుకలు, జంతువుల మలమూత్రాల వల్ల సర్కులేటరీ సిస్టమ్ దెబ్బతిని అంతర్గత రక్తస్రావాలు, ఎలుకలు, జంతువుల మలమూత్రాల వల్ల సర్కులేటరీ సిస్టమ్ దెబ్బతిని అంతర్గత రక్తస్రావాలు కనిపిస్తాయి.

ఉదా: ఎబోలా, డెంగ్యూ, ఎల్లోఫీవర్, మర్బార్ హెమరేజిక్ ఫీవర్స్, కాంగో హెమరేజిక్ ఫీవర్.

6) న్యూరాలాజికల్ వైరల్ ఇన్ఫెక్షన్స్: ఉదా: పోలీయో, వైరల్ మెనింజైటిస్, ఎన్‌సెఫలైటిస్.

వ్యాధి లక్షణాలు: వివిధ రకాల వైరస్‌ల్ని బట్టి వ్యాధిలక్షణాలు మారుతాయి. జ్వర తీవ్రత ఎక్కువగా ఉండి చలి, వణుకు, చెమటలతో కూడి ఉంటుంది. అలసట, బలహీనత, తుమ్ములు, ముక్కు కారడం, ముక్కుదిబ్బడ, కళ్లమంటలు, మైకం, గొంతునొప్పి, ఫారింక్స్ వాపు, టాన్సిల్స్ వాపు, ముఖంవాపు, కళ్లు ఎర్రబడడం, చర్మంపై దద్దుర్లు, శ్వాస ఆడకపోవడం, వికారం, వాంతులు, విరేచనాలు, పొత్తికడుపు నొప్పి అధిక చెమటలు, డీహైడ్రేషన్, ఆకలి లేకపోవడం, ఛాతినొప్పి, బాడీపెయిన్స్, కండరాల నొప్పులు, కీళ్లనొప్పులు వంటి లక్షణాలుంటాయి.

వైరల్ జ్వరం లక్షణాలు చాలా వ్యాధులకు సాధారణం కాబట్టి జ్వరం నిర్దిష్ట రూపాన్ని నిర్ధారించవచ్చు.

ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో కొన్ని రకాల వైరస్‌లు కొన్ని సీజన్స్‌లో సాధారణంగా కన్పిస్తాయి. వీటినే సీజనల్ ఫీవర్స్ అని కూడా అంటారు.

ఉదా: డెంగ్యూ: దక్షిణ అమెరికా, కరేబియా, అగ్నేషియా ఫసిఫిక్ ప్రాంతాల్లో వర్షాకాలంలో, శీతాకాలంలో కన్పిస్తాయి. మలేరియా: ఆఫ్రికా, ఆసియా, ఉష్ణమండల ప్రాంతాల్లో వర్షాకాలంలో కన్పిస్తాయి.

వైరల్/ బాక్టీరియల్ ఫీవర్స్ మధ్య తేడా: ఇవి తరచుగా ఒకేవిధమైన లక్షణాల్ని కల్గించినప్పటికి అనేక విధాలుగా ఒకేలా ఉండవు. వ్యాధికార రకాన్ని బట్టి చికిత్స భిన్నంగా ఉంటుంది.

పోస్ట్‌వైరల్ దగ్గు: చాలామంది వైరల్ ఫీవర్స్ బారినపడిన తర్వాత దగ్గు తగ్గక చాలారోజులు బాధపడుతుంటారు. దీన్నే పోస్ట్ ఇన్ఫెక్షువస్ దగ్గు లేదా పోస్ట్ వైరల్‌కాఫ్ అని అంటారు. ఇది గొంతులో శ్లేష్మం, పోస్ట్‌నాసల్ డ్రిప్, వాయుమార్గాలవాపు చికాకు కల్గి దగ్గు వస్తుంది. ఇది 6-8 వారాలుండి దానంతట అదే తగ్గిపోతుంది.

రిస్క్ ఫ్యాక్టర్స్: పిల్లలు, వృద్ధులు, సిఓపిడి, డయాబెటిస్, క్షయ, గుండె, కిడ్నీ వంటి దీర్ఘకాలిక రోగులు, ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారు, పోషకాహారలోపం ఉన్నవారు, కేన్సర్, హెచ్ఐవి ఉన్న వారు, వ్యాధిసోకిన వ్యక్తికి దగ్గరగా ఉండేవారికి, వైరల్‌జ్వరం ప్రబలంగా ఉన్న ప్రాంతానికి వెళ్లేవారు, నివసించేవారు, అపరిశుభ్రంగా ఉన్నవారిలో రిస్క్ ఎక్కువ.

కాంప్లికేషన్స్: డీహైడ్రేషన్, న్యూమోనియా, ఛాతీ నొప్పి, కామెర్లు, ఫిట్స్, షాక్, సైనసైటిస్, కోమా, ఆస్తామా, రేయిసింద్రోమ్ (ఆస్పిరిన్ ఎక్కువగా వాడేవారిలో), అక్యూట్ బ్రాంకైటిస్, సెకండరీ బాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ వంటి కాంప్లికేషన్స్ ఏర్పడతాయి.

పిల్లల్లో వైరల్ ఫీవర్స్: జ్వరం 4-5 రోజులైనా తగ్గకపోయినా, జ్వర తీవ్రత ఎక్కువైనా, దగ్గు మందులకి స్పందించకపోయినా, ఆయాసం, తరచుగా వాంతులు, విరేచనాలు, దద్దుర్లు, డీహైడ్రేషన్ ఉన్నప్పుడు సొంతవైద్యం చేయక డాకర్ని సంప్రదించడం మంచిది.

వృద్ధులు: వైరల్ ఫీవర్స్‌తో కొన్ని ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. వీటినే విషజ్వరాలు అంటారు. గిరిజన ప్రాంతాల్లోని వారు, దోమలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని వారు చికెన్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలతో ఎక్కువగా బాధపడుతుంటారు. వైరల్ ఫీవర్స్ ప్రభావం కండరాలు, కీళ్లపై ఎక్కువగా ఉండడం వల్ల జ్వరం తగ్గిన కొన్ని వారాలు నెలల వరకు కీళ్లనొప్పులు, కండరాల నొప్పులు, నీరసంతో బాధపడుతుంటారు. వీరు బి.పి, షుగర్, థైరాయిడ్ వ్యాధుల్ని కంట్రోల్‌లో ఉంచుకోవాలి. వీరు ధూమపానం, ఆల్కహాల్ వంటి ఇతర చెడు అలవాట్లని మానివేయాలి. ఇలాంటివారు హుమిడిఫైయర్లు, నాసల్‌స్ప్రేలు, స్టెరాయిడ్ ఇన్‌హేలర్స్, ఆవిరి పట్టడం, రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాన్ని తీసుకోవాలి.

వైరల్ ఫీవర్స్‌లో మందుల పాత్ర

వైరల్ ఫీవర్స్‌కి పారాసిటమాల్, ఆంటివైరల్ మందుల్ని వాడాల్సి ఉంటుంది. ఆంటి బయాటిక్స్ వాడితే ఆంటిబయాటిక్ రెసిస్టెన్స్ పెరుగుతుంది. బాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌కి ఆంటిబయాటిక్స్ వాడవచ్చు.

ఆంటిబయాటిక్స్ వైరస్‌ల్ని చంపలేవు. కాని హానికరమైన బాక్టీరియాని మాత్రమే చంపుతుంది. అనవసరంగా తీసుకుంటే మీ కడుపు లైనింగ్‌పై ప్రభావం చూపుతుంది. దీనివల్ల గట్ బాక్టీరియా నాశనం అవుతుంది. రోగనిరోధక శక్తి తగ్గి లివర్, కిడ్నీస్‌ని దెబ్బతీసే అవకాశం ఉంది. బాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ వచ్చినపుడు ఈ మందులు ప్రభావం చూపవు.

నివారణ-జాగ్రత్తలు

చేతులు పరిశుభ్రత, ఇల్లు పరిసరాల శుభ్రత ముఖ్యం. వ్యక్తిగత పరిశుభ్రత అవసరం. ఇన్ఫెక్షన్ ఇతరులకి సోకకుండా మాస్క్ ధరించడం, చేతులకి గ్లోవ్స్ ధరించడం, ఎప్రాన్ ధరించడం మంచిది.

– దోమలు, కీటకాలు కుట్టకుండా, చెత్తచెదారం లేకుండా, మురికి నీరు నిల్ల ఉండకుండా చూసుకోవాలి.

– డిస్‌పోజిబుల్ నీడిల్స్/ ఇంజెక్షన్స్ వాడాలి. శానిటేషన్, శానిటైజర్స్ వాడడం ముఖ్యం.

– ఆంటివైరల్ మందులు, పెయిన్ కిల్లర్స్ వాడాలి. నాసల్ డికంజెస్టంట్స్, దగ్గు మాత్రలు, సిరప్స్ వాడడంతో పాటు ఆవిరి పట్టడం, గోరువెచ్చని నీళ్లలో ఉప్పువేసి పుక్కిలించడం మంచిది.

–డీ హైడ్రేషన్ లేకుండా నీరు, జ్యూస్‌లు ఎక్కువగా తీసుకోవాలి. ఆహారం, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్ లేకుండా ఐ.వి.ఫ్లూయిడ్స్ వాడాలి.

– గాలి, వెలుతురు ఉండాలి. తగిన వ్యాయామంతోపాటు పోషకాహారం తీసుకోవాలి.

– ఓపిక ఉంటే స్నానం చేయడం మంచిది. వీలుకాని పక్షంలో గోరువెచ్చని నీటితో శుభ్రపర్చిన క్లాత్‌తో తుడుచుకోవాలి. లేదా స్పాంజ్‌బాత్ చేయడం వల్ల శారీరక నొప్పులు, చెమటవాసన, శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. శరీర ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటే క్లాత్‌లో ఐస్ ఉంచి శరీర ఉష్ణోగ్రతను కంట్రోల్ చేయాలి. నుదుటి మీద తడిగుడ్డతో తుడవాలి.

– ఆహారం: వైరల్ ఫీవర్ కారణంగా ప్లేట్‌లెట్స్ (థ్రాంబోసైటో పినియా) సంఖ్య తగ్గిపోతుంది. ప్లేట్‌లెట్ సంఖ్యని పెంచడానికి ఫోలేట్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకుంటే దానంతట అదే తగ్గిపోతుంది. ఆహారంగా తృణధాన్యాలు, నారింజ, బచ్చలి, ఇడ్లీసూప్‌లు, గంజి, కిచిడీ, బాగా వండిన మెత్తని కూరగాయలు, పండ్లు, తక్కువ ఫైబర్ ఉన్న ఆహారాలు తీసుకోవాలి. సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. రసం తినవచ్చు. చప్పగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి.

విటమిన్ సి.జింక్, తేనె వంటి రోగ నిరోధకశక్తిని పెంచే ఆహారాన్ని తీసుకోవాలి. ఆహారంలో వెల్లుల్లి, అల్లం ఒక భాగంగా తీసుకోవచ్చు. ఎందుకంటే వీటిలో ఆంటిమైక్రోబియల్ లక్షణాల్ని కల్గి ఉండడం వల్ల వైరల్ ఫీవర్స్ సమస్యల (వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి) వచ్చే అవకాశముంది. మసాలాలు, కారంగా ఉండే ఆహారాలు, స్పైసీసాస్‌లు మిరియాలు ఉండే ఆహారం తీసుకున్నప్పుడు గొంతునొప్పి, దగ్గుని ఎక్కువ చేస్తాయి. అతిగా రుచికోసం చేసిన వంటకాల్ని తీసుకోరాదు. పాల ఉత్పత్తులు, పాలు, ఛీజ్, పెరుగు శ్లేష్మాన్ని చిక్కపరుస్తాయి. కెఫీన్, సోడా, ఆల్కహాలిక్ పానీయాలు, కూల్‌డ్రింక్స్, కాఫీ, టీ, చాక్‌లెట్స్, కోక్, ఎనర్జీ, డ్రింక్స్ ఎక్కువగా తీసుకుంటే డీహైడ్రేషన్ వస్తుంది. వైరల్‌ఫీవర్

వచ్చినపుడు శరీరం నీటిని కోల్పోయేలా చేస్తుంది. దీనివల్ల కోల్పోయిన ద్రవాల్ని తిరిగి నింపడానికి తగిన నీరు, పండ్లరసాలు, ఎలక్ట్రోలైట్స్ తీసుకోవాలి. తగినంత విశ్రాంతి 8-9 గంటలు తీసుకోవాలి. జ్వరం తగ్గడానికి ఆంటిపైరెటిక్స్, ఇబుప్రొఫెన్, ఆంటి ఇన్‌ఫ్లమేటరీ మందులు వేసుకోవాలి. వైరల్ ఫీవర్ వచ్చినపుడు ఎక్కువగా మందులు వాడరాదు.

దగ్గినపుడు, తుమ్మినపుడు మోచేయి అడ్డంగా పెట్టుకోవాలి. పిల్లల్లో నిర్ణీత సమయంలో ఇన్‌ఫ్లుయెంజీ, మీజిల్స్, చికెన్‌పాక్స్, గవదబిళ్లలు వంటి వివిధ వైరస్‌లకు వ్యాక్సిన్స్ వేయడం మంచిది. వ్యాధి కారణాన్ని బట్టి చికిత్స అందించాలి. కాచి చల్లార్చిన నీరు తీసుకోవాలి. ఒత్తిడి తగ్గించుకోవాలి. రోగి దుస్తులు, వస్తువులు సపరేట్‌గా ఉంచాలి. ఐసోలేషన్‌లో ఉండాలి. సపోర్టివ్ కేర్ ముఖ్యం. వ్యాధి నిర్ధారణ కాకుండా వైరల్ జ్వరానికి ఆంటిబయాటిక్స్ పెయిన్‌కిల్లర్స్ వాడరాదు. రక్త, మలమూత్ర పరీక్షలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ టెస్ట్‌లతో పాటు అవసరమైతే సిటిస్కాన్, అల్ట్రాసౌండ్స్, ఎక్స్‌రే తీయించాలి.

హోమ్ రెమిడీస్

కొత్తిమీర, టీ, మెంతి కషాయం, తులసి, బొప్పాయి ఆకుల కషాయం, జావ, పొడి అల్లం కషాయం నిమ్మరసంలో తేనె వేసుకొని తాగడం, పాలలో పసుపు వేసుకొని తాగడం, తులసి లవంగాల కషాయం, గోరువెచ్చని నీటిలో నిమ్మరసం నల్లమిరియాల పొడి కలిపి తీసుకోవడం, జీలకర్ర ధనియాల కషాం తీసుకోవచ్చు.

ఆవనూనెలో కొన్ని వెల్లుల్లి రెబ్బలు వేసి వెచ్చ చేసిన నూనెని అరికాళ్లకు రాస్తే జ్వరం తగ్గుతుంది.

హోమియో చికిత్స

వైరల్ ఫీవర్‌స రాకుండా, వ్యాధి తీవ్రతని తగ్గించే ఆర్స్‌ఆల్బ్, రూస్టాక్స్ మందుల్ని వాడుకోవచ్చు. ఇవేగాకుండా లక్షణాల్ని బట్టి ఎకోనైట్, బెల్లడోనా, పల్సటిల్లా, ఆంటిమ్ టార్ట్, ఎలియమ్‌సెపా, యుఫ్రేసియా ఇన్‌ఫ్లూయెంజినమ్ మందుల్ని వైద్యపర్యవేక్షణలో వాడుకోవచ్చు. ❒

'ఫైన్' యాపిల్!

తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి

మంచి భోజనం, స్వచ్ఛమైన తాగునీరు, పండ్లు... ఇలా సక్రమంగా అన్నీ తీసుకుంటుంటే ఎప్పటికీ ఆరోగ్యంగా వుండవచ్చు. ప్రకృతిలో పైనాపిల్‌లో మాత్రమే కనిపించే బ్రోమెలైన్, ఆహార పదార్థాలు మరియు అనేక ముఖ్యమైన సమస్యల నిరోధానికి ఉపయోగిస్తారు. పుల్లగా...తియ్యగా ఉండే అనాస పండును తీసుకుంటే ఆరోగ్య ప్రయోజనాలెన్నో. ఒత్తిడి, ఆందోళనకు ఎక్కువగా గురవుతున్నవారు పైనాపిల్ తీసుకుంటే మంచిది.

ఇందులోని సోడియం, పొటాషియం టెన్షన్స్‌ను తగ్గిస్తాయి. చిన్నపిల్లలకు తగినంత పాలు లభించనట్లయితే అలాంటి వారికి అనాసపండు రసమిస్తే మంచిదంటున్నారు వైద్యులు. ప్రత్యేకమైన రంగు పైనాపిల్‌కు ప్రధాన ఆకర్షణ. పై పొర ముళ్ళులా ఉండడం, వైవిధ్యమైన ఆకారం ఇవన్నీ పైనాపిల్‌ను ప్రత్యేకంగా ఉంచుతున్నాయి. పైనాపిల్ రుచి తియ్యగా ఉంటుంది. పైనాపిల్‌తో జ్యూస్‌ను తయారు చేస్తారు. సలాడ్స్, సైడ్ డిషెస్‌కు కూడా పైనాపిల్‌ను ఉపయోగిస్తారు. పైనాపిల్‌లో ఎన్నో పోషకాలు ఉన్నాయి. కొన్ని రకాల ఆరోగ్య సమస్యలకు పైనాపిల్‌ను ఔషధంగా కూడా ఉపయోగిస్తారు.

పైనాపిల్ ఎక్కువ రోజులు నిల్వ ఉండదు. త్వరగా కుళ్లిపోతుంది. కాబట్టి కొన్న వెంటనే తినడం మంచిది. చాలామంది పైనాపిల్‌ను ఫ్రిజ్‌లో పెడుతుంటారు. కానీ అరటిపండ్లలానే దీనికి ఫ్రిజ్ పడదు. బయట ఉంచడమే మంచిది. తొక్కతీసిన పైనాపిల్‌ను వెంటనే గాలి చొరబడని డబ్బా లేదా ప్లాస్టిక్ కవర్‌లో ఉంచి ఫ్రిజ్‌లో పెడితే నాలుగైదురోజుల పాటు నిల్వ ఉంటుంది. జ్యూస్‌ని ఫ్రిజ్‌లో పెడితే రుచి మారుతుంది. దానికన్నా ముక్కలుగా నిల్వ చేయడమే మంచిది. కేనింగ్ లేదా ప్రాసెస్ చేసినవయితే ఏడాది వరకూ నిల్వ ఉంటాయి.

గులాబిరంగు పైనాపిల్

పైనాపిల్ పైన ముదురు గోధుమరంగు పొలుసులతో.. లోపల పసుపు రంగుల్లో ఉంటుంది. అయితే ఈ పండును గులాబి రంగులోకి మార్చడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. ముఖ్యంగా 'డెల్ మొంటే' అనే ప్రముఖ ఆహార ఉత్పత్తి సంస్థకు గులాబి రంగు పైనాపిల్‌ను సృష్టించాలనేది ఓ కల. అందుకే 2005 నుంచి ఆ సంస్థ గులాబి రంగు పైనాపిల్‌ను ఉత్పత్తి చేసే పనిలో పడింది. అయితే తాజాగా ఆ కల సాకారమై గులాబి రంగు పైనాపిల్‌ను పండించింది.

కొంతమందిలో చిగుర్లు, పళ్ల నుంచి రక్తం వస్తూ ఉంటుంది. అలాంటి వారు ఈ పండు తీసుకుంటే మంచిది. గొంతునొప్పి నుంచి బయటపడాలంటే అనాసపండు జ్యూస్ చాలా మంచిది. అనాస రసాన్ని పచ్చకామెర్ల వ్యాధి, కాలేయ వ్యాధి ఉన్నవారు ప్రతిరోజు తాగితే మంచి ఫలితం ఉంటుంది. అజీర్తి సమస్యతో బాధపడేవారికి ఈ జ్యూస్ దివ్య ఔషధమే. పైనాపిల్‌లో విటమిన్లు ఎ, బి1, బి3, బి6, ఒమేగా 3, ఒమేగా 6 కొవ్వు ఆమ్లాలు, పొటాషియం, ఇనుము, మెగ్నీషియం, రాగి, ఫోలేట్, కాల్షియం, జింక్, భాస్వరం కూడా ఉన్నాయి. ఇది ప్రేగులను శుభ్రపరుస్తుంది. పైనాపిల్ మాంసాన్ని జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. పైనాపిల్‌లోని ప్రోటీన్ ఈస్ట్ ఆహారంలోని ప్రోటీన్‌లను సమర్థవంతంగా కరిగించి ప్రేగులను శుభ్రం చేస్తుంది. పైనాపిల్‌లో బీటా కెరోటిన్, థయామిన్ ఉన్నాయి. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. కొల్లాజెన్ క్షీణతను ఉత్ప్రేరకపరిచే సామర్థ్యం కారణంగా ఇది మెటాస్టాసిస్ అవకాశాన్ని కూడా తొలగిస్తుంది. కేన్సర్ కణాల వ్యాప్తిని నిరోధిస్తుంది. గుండె ఆరోగ్యానికి సహాయపడుతుంది. కేన్సర్ కణాల పెరుగుదలని నిరోధిస్తుంది.

పైనాపిల్ తినడం వల్ల కలిగే మరో ప్రయోజనం ఏమిటంటే, ఇది గుండెపోటు, హృదయనాళ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎందుకంటే ఈ రుచికరమైన పండు రక్తం గడ్డకట్టడంతో పోరాడుతుంది. ఇది రక్తనాళాల గోడలకు ప్లేట్‌లెట్స్ ఏర్పడకుండా లేదా అంటుకోకుండా నిరోధిస్తుంది.

మాక్యులర్ డీజెనరేషన్ (ఎల్లో డాట్):

మాక్యులర్ డీజెనరేషన్ కంటి సమస్య. ఇది సాధారణంగా వృద్ధాప్యం, ధూమపానం కారణంగా సంభవిస్తుంది. పైనాపిల్‌లో అధికంగా ఉండే బీటాకెరోటిన్ ఈ సమస్యను పరిష్కరించడానికి, కంటి ఆరోగ్యాన్ని కాపాడటానికి సహాయపడుతుంది. యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉన్న పైనాపిల్, సైనసైస్ వాపు లేదా గవద జ్వరం వంటి వ్యాధులకు కూడా అనుకూలంగా ఉంటుంది. దగ్గును తగ్గించడంలో సహాయపడుతుంది. ఎముకలను బలోపేతం చేయడంలో ప్రభావవంతంగా ఉంటుంది. దంతాలను బలపరుస్తుంది. ఇది ఎముక ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఉబ్బరం తగ్గిస్తుంది. శస్త్రచికిత్స గాయాలను నయం చేయడానికి, బాధాకరమైన మంట చికిత్సకు, శస్త్రచికిత్సకు ముందు, తరువాత వైద్యుని పర్యవేక్షణలో బ్రోమెలైన్

ఉపయోగించవచ్చని పరిశోధనలో తేలింది. పిల్లలలో వైరల్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ల నిరోధకత, తెల్లరక్త కణం ఏర్పాటును వేగవంతం చేస్తుంది. సైనస్ కావిటీలలో పేరుకుపోయిన కఫం, శ్లేష్మం తగ్గించడానికి సహాయపడుతుంది. బ్రోమెలైన్ ఎంజైమ్ రుమటాయిడ్ ఆర్థరైటిస్ లక్షణాలు, ఆస్టియో ఆర్థరైటిస్ రోగుల నొప్పిని తగ్గించడంలో ప్రభావవంతంగా ఉండవచ్చు.

పైనాపిల్ మాస్క్!

ఇది జుట్టు కుదుళ్లను పోషించడం ద్వారా జుట్టు రాలడాన్ని నివారిస్తుంది. జుట్టుకు శక్తిని ఇస్తుంది. చర్మాన్ని అందంగా మృదువుగా ఉంచటానికి అవసరమైన విటమిన్లు ఉన్నందున చర్మాన్ని అందంగా చేస్తుంది. పొడి చర్మం కలిగి ఉండటం వల్ల ముఖ్యంగా శీతాకాలంలో సమస్యలు వస్తాయి. శీతాకాలంలో చల్లని వాతావరణం కారణంగా, పొడి చర్మం, పగుళ్లు, ఎక్స్ ఫోలియేట్స్ సమస్యలు ఉంటాయి. దీనిని నివారించడానికి గిన్నెలో గుడ్డు పచ్చసొన, కొద్ది మొత్తంలో పాలు, పైనాపిల్ ముక్క కలపాలి. ఈ మిశ్రమాన్ని చర్మపు పూతగా వేసి ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి. పైనాపిల్ రసాన్ని ముఖానికి పట్టించి, ఆరిన తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేస్తే వయస్సు ప్రభావాన్ని తగ్గిస్తుంది.

పొట్టచుట్టూ కొవ్వు పేరుకుపోయిన వారికి ఈ పండు మంచి ఔషధంలా పనిచేస్తుంది. దీని ముక్కలను నాలుగు టీస్పూన్ల వాముపొడితో కలిపి ఒక గ్లాసు నీళ్లు పోసి బాగా ఉడికించాలి. రాత్రంతా అలాగే ఉంచి తర్వాత రోజు ఉదయాన్నే వాటిని వడకట్టి ఆ కషాయాన్ని పరగడుపునే తాగాలి. ఇలా పది రోజులు తాగితే ఆ తర్వాత పొట్ట తగ్గడం మొదలవుతుంది. పైనాపిల్ తింటే పచ్చకామెర్లు నయమవుతాయి.

పైనాపిల్ ముక్కలుగా గానీ, జ్యూస్‌గా గానీ తీసుకుంటే మూత్రపిండాలలోని రాళ్లు కరుగుతాయి. ఒళ్లనొప్పులు, నడుమునొప్పి వంటి వాటిని తగ్గిస్తుంది. పైనాపిల్ తింటే కంటి చూపు మెరుగౌతుంది. ఆకలి లేదని అన్నం తినడానికి మారాం చేసే పిల్లలకు ఈ పండు రసం పట్టిస్తే ఆకలి బాగా పెరుగుతుంది. పైనాపిల్ వలన శారీరక ఎదుగుదల, ఎముకల పటుత్వం మెరుగవుతాయి. ఈ ఆకుల రసంలో ఒక చెంచా తేనె కలిపి తాగితే విరేచనం అయ్యి, కడుపులోని పురుగులు బయటపడతాయి. ఈ పండు ముక్కలను తేనెలో కలిపి తింటే శారీరక శక్తి పెరుగుతుంది. శరీరం నిగారింపుతో ఉంటుంది. కడుపు నిండుగా ఆహారాన్ని తీసుకున్న తర్వాత ఒక చిన్న పైనాపిల్ ముక్క తింటే చాలు తేలిగ్గా జీర్ణమౌతుంది.

సైడ్ ఎఫెక్ట్స్

పైనాపిల్ వల్ల కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉంటాయి. అయితే, ఈ సైడ్ ఎఫెక్ట్స్ మరీ అంత ప్రమాదకరమైనవి కావు. తగినంత మాత్రమే తీసుకుంటే పైనాపిల్ వల్ల ఎదురయ్యే సైడ్ ఎఫెక్ట్స్ నుంచి తప్పించుకోవచ్చు. అందుకు తగిన జాగ్రత్తలు కచ్చితంగా తీసుకోవాలి. కొంతమందిలో పైనాపిల్ అలర్జిక్ రియాక్షన్స్ చూపిస్తుంది. పైనాపిల్ తినడం వల్ల స్వల్ప అలర్జిక్ రియాక్షన్స్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువ. పెదవి వాపు, గొంతులో దురద వంటివి దీని లక్షణాలు. ఈ సమస్యను అధిగమించేందుకు పైనాపిల్‌ను తినేముందు పైనాపిల్ ముక్కలను శుభ్రమైన సాల్ట్ వాటర్‌లో క్లీన్ చేయాలి. ఇలా చేయడం వల్ల ఈ పండులో ఉన్న ఎంజైమ్స్ తొలగిపోతాయి. తద్వారా రాషెస్ రాకుండా జాగ్రత్త పడవచ్చు.

పైనాపిల్‌లో సహజసిద్ధంగా షుగర్ స్థాయి ఎక్కువగా ఉంటుంది. సుక్రోస్ - ఫ్రక్టోస్‌లు ఉంటాయి. కాబట్టి మధుమేహ వ్యాధితో బాధపడుతున్నవారిపై పైనాపిల్ దుష్ప్రభావం ఉంటుంది. పైనాపిల్ పండును తీసుకున్న స్థాయిని బట్టి దాని దుష్ప్రభావం ఉంటుంది. పైనాపిల్, రక్తంలోని ఇన్సులిన్ స్థాయిలను రేకెత్తిస్తుంది. రక్తంలోని షుగర్ లెవల్‌ను నియంత్రించడానికి పైనాపిల్‌ను మితంగా తీసుకోవాలి.

ఆల్కహాల్‌తో కూడా పైనాపిల్ ఇంటరాక్ట్ అవడం వల్ల కొన్ని రకాల దుష్ప్రభావాలు ఉన్నాయి. అటువంటి మెడికేషన్స్ తీసుకుంటున్నట్లయితే పైనాపిల్ తినడానికి ముందు వైద్యుల సలహాను తప్పనిసరిగా తీసుకోవాలి. పైనాపిల్ వల్ల కలిగే దుష్ప్రభావాలను పక్కన పెడితే, పైనాపిల్ వల్ల ఎన్నో ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఏదన్నా ఎక్కువగా తీసుకుంటే విషంగా మారుతుందన్న నానుడి తెలిసినదే కదా. ఇదే అంశం పైనాపిల్‌కు కూడా వర్తిస్తుంది. ❑

ఓజోన్ రక్షతి రక్షితః

పెద్దోళ్ల యుద్ధోన్మాదమైనా అభివృద్ధి
ఉన్మాదమైనా పేదోళ్ల చావుకేగా!
వాళ్ల అణురియాక్టర్లు, కర్బన ఉద్గారాలు
పర్యావరణానికి శత్రువులు!
మనిషి స్వార్థం కాలుష్యమై మళ్లీ
మనిషేగా కబళించేది!
ఈ నీలి స్వర్గానికి ఆగర్భ శత్రువులు
అతినీల లోహితలు!
అవి చొరబడి
విధ్వంసం చేయకుండా
సృష్టి
ప్రసాదించిన సహజ కవచమే ఓజోన్!
ఓజోన్ ఛత్రం ఇప్పుడు చిరుగులు పట్టింది!
అణురియాక్టర్లు, కర్బన ఉద్గారాలు
సహజ వనరుల్ని పణంగా పెట్టి సృష్టించే
కృత్రిమ అభివృద్ధిని దూరం పెట్టాలి!
లేదంటే నీలి స్వర్గం కాస్తా అతినీల లోహిత
నరకం కాక మానదు!

– భీమవరపు పురుషోత్తమ్

కలాన్ని నేను

పెన్ను నాకు దన్ను
ఈ మన్ను నాకు వెన్ను
మిన్నకుండను
మిన్నునంటను
నిజాలను నిర్భయంగా
నిగూఢతను నిశ్శేషంగా
జఢత్వంలోకి జాగృతిని రప్పిస్తా
అస్థిత్వానికి జవసత్వాలు కల్పిస్తా

కన్నీళ్లను నిప్పుల వానగా
గుండె మంటలను చైతన్య జ్వాలగా
పిరికితనం గడ్డకట్టిన రక్తాన్ని
సిరా సెగతో సలసల రగిలిస్తా

అక్షర సేద్యంతో ప్రశ్నలు మొలకెత్తిస్తా
లక్షల గొంతులు కలిపే వారధిగా పేరుస్తా
ఉరిమే శక్తిని కూడదీసి కలాన్ని ఝుళిపిస్తా
గర్జించే మేఘాలకు తడి గొంతుక నేనౌతా

మునివేళ్ల నుండే ముల్లోకాలను మేల్కొలుపుతా
మోచేతులపైనే నవలోకాన్ని నిర్మిస్తా
బలవంతుడిని కాను
భగవంతుడిని కానేకాను
ఎటొచ్చీ.. నేను కలాన్ని మాత్రమే.

– వినోద్ కుత్తుం

కనురెప్పల్లో నీవు

అడుగు అడుగున
తన అరచేతిని రక్షగా
నడక నేర్పి, గమ్యం చెప్పి!
కనురెప్పలను కవచాలుగా
కంటి పాపలా కాపాడింది.
ఒడిని బడిగా
నేర్పని పాఠం లేదు.
కలలు నిజమయ్యేలా
నిజం కలకాలం నిలబడేలా
తాను నీడై
గెలుపులో మలుపు అయింది.
వెన్నుదన్నుగా నిలబడి
ఎదనిండా ఎదుగుదలను కాంక్షిస్తూ
కీర్తి శిఖరాన నిలిపింది.
సమస్యలకు సమాధానమై
ఇష్టాల్లో స్ఫూర్తినిచ్చింది
తడబడిన ప్రతిసారి
పడకుండా నిలబెట్టింది.
చివరి క్షణాల్లో
ఎక్కడో అందనంత దూరాన నీవు
నీకు జన్మనిచ్చిన నేలన తాను.
మూసుకున్న కనురెప్పల్లో నీవు
తన కంటి పాపలా నాడు.
తను కన్న జ్ఞాపకంలా నేడు!

– జగన్ జి

భారతదేశ చరిత్ర: డా॥కత్తిపద్మారావు

మహాత్మాపూలే, అంబేద్కర్ ఆలోచనా మేధా దృక్పథ అధ్యయనంతో భారతదేశ చరిత్రను వారి దృక్కోణంలో అవలోకించి, దర్శించి లిఖించగల మేధా సంపన్నులైన డా॥కత్తిపద్మారావు బృహద్గ్రంథ రచయితగా తెలుగునాట సుప్రసిద్ధులు. డా॥అంబేద్కర్ అడుగుజాడలలో, సామాజిక తత్వవేత్తగా మహాకవిగా డా॥పద్మారావు లోకాయత ప్రచురణలలో 87వ గ్రంథంగా, భారతదేశ చరిత్ర మూడవభాగం వెలువడింది. 22 అధ్యాయాలలో డా॥అంబేద్కర్, పూలే, భావజాల సముజ్వలంతో చరిత్రను పునర్ లిఖించడం, సామాజిక, సాంస్కృతిక, తాత్విక దృక్పథంతో చరిత్రను అర్ధశతాబ్దిపైగా లోలోతుల్లో అన్వేషించడం నిర్మాణానికి ఆధారమైన మూలగ్రంథాలను పరిశోధనాత్మక జిజ్ఞాసతో అధ్యయనం చేయడం, చారిత్రక ప్రమాణాలతో రచనలు చేయడంలో డా॥పద్మారావు సిద్ధహస్తులు. హిందూవాద రచయితలతో భారతదేశ చరిత్ర సృష్టించారని, భారతదేశ చరిత్రను పునర్నిర్మించడానికి మహాత్మాపూలే, అంబేద్కర్‌ల భావజాలంతో చారిత్రక గమనాన్ని, చారిత్రక మూలాలను, హిందూ వాదాన్ని అక్బర్, తుగ్లక్, కృష్ణదేవరాయలు మొఘల్ సామ్రాజ్య చరిత్రను 55వేల గ్రాంథాల భిన్న ఆలోచనాసారాంశ తాత్వికతను, డా॥పద్మారావు ప్రతిభావంతంగా చదువరులకు అందచేసారు. **(భారతదేశ చరిత్ర, రచన: డా॥కత్తి పద్మారావు, వెల: రూ 500, ప్రతులకు: కత్తి స్వర్ణకుమారి, అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్, లోకాయత ప్రచురణలు, లుంబినీవనం, అంబేద్కర్ కాలనీ, పొన్నూరు, గుంటూరు జిల్లా)** **– యర్రమిల్లి**

అద్భుతకళా 'రంగ్ మహల్'

ఉర్దూ ఛందశ్శాస్త్రాన్ని, ఉర్దూ వ్యాకరణాన్ని తెలుగు వారికి అందించిన భాషాశాస్త్రవేత్త లక్ష్మణ్‌రావు పతంగే. అలాగే తెలంగాణ జనపదాలు ప్రచురించారు. ఉర్దు-తెలుగు, తెలుగు ఉర్దూ-నిఘంటువు, హిందీ, ఉర్దూ జాతీయాలు సామెతల నిఘంటువు-తెలంగాణలో ఉర్దూ భాష అనే నిఘంటువులు అందించారు. 'రంగ్ మహల్' నవల సితారాబాయి (బాయమ్మ) నడిపే నృత్యగాన సంగీత-శృంగార మందిరి-(మెహఫిల్) కేంద్రంగా సాగుతుంది. అక్కడ వుండే చంపా, చమేలీ, యాసీన్‌బీలు..రూపా, లలితా, రమ్యా, జ్యోతి, రాణిలాంటి అందమైన అమ్మాయిలూ వారి మనస్తత్వాలు, వేశ్యా వృత్తిలోకి వచ్చిన తీరు వారికి అండగా సేవాసదన్ నిర్వాహకురాలు సుజాత, వారిని సంస్కరించే రీతిలో ఇంటర్వ్యూ చేయడం విటుడు శ్రీకాంత్-రాణిని పెళ్లాడటం, బాయమ్మ మృతి విటులైన రోషన్-చంపాను, ఎక్బాల్ చమేలీని ప్రేమించి సుజత సేవాసదన్ ద్వారా పెళ్లాడటం..రంగ్‌మహల్ సిబ్బందిని 'సేవాసదన్' ఆదుకోవడం..కొన్నాళ్లకు రంగ్‌మహల్‌ను పాఠశాలకు వాడటం.. వందేళ్ల భవనాన్ని బాల్యం నుండే గమనించే రంగనాథ్ సారథ్యంలో టౌన్‌ప్లానింగ్ అధికారిగా కూల్చడంతో నవల ముగుస్తుంది. ఆనాటి సామాజిక ఆర్థిక పరిస్థితులు నిజాం పాలన టీ, పూల, దుకాణాలు.మదీనా సెంటర్, చార్మినార్, గాజుల దుకాణాలు, బిర్యానీ వంటకాలు...ఇలా ఎన్నో ఆనాటి పరిస్థితులు ఈ నవలంతా నిండి ఉన్నాయి. **(రంగ్‌మహల్, రచన: లక్ష్మణ్‌రావు పతంగే, వెల: రూ 60, ప్రతులకు: తెలంగాణ పబ్లికేషన్స్)** **– తంగిరాల చక్రవర్తి**

పుస్తక సమీక్ష

పలు ప్రక్రియల్లో నలభైకి పైగా గ్రంథాలు రచించిన ఎస్.ఆర్.పృథ్వి తాజాగా వెలువరించిన పద్యకావ్యం 'ఇంద్రధనస్సు'. తేటగీతి, ఆటవెలది, సీసము, కందములందు వైవిధ్యభరిత అంశాలమీద సందర్భానుసారంగా అల్లిన పద్యాలు యివి. 'చెట్టునాటిన నదికోరి చింతదీర్చు/ జీవికి బ్రతుకునకును, జీవమగును/ రక్షణైనది రాణింపు రాగమగును/ చెట్టునెన్నడు

అలరిస్తున్న పద్యేంద్ర ధనస్సు

నరకకు చెడును కూడి' అలతి అలతి పదాలతో పర్యావరణ రక్షణావశ్యకతను తేటగీతిలో తెలియజేశారుకవి. 'ఎవరి మతము వారికి గొప్ప ఎట్టులున్న/ మతమునందున జెప్పిన మంచినంత/ మనసునందున వడబోసి మనిషికాగ/ సంతసమ్ము గల్లును గద చక్కగానను!' సర్వమత సామరాశ్యతను ఉద్బోదించిన పద్యం యిది. 'మాటకి మాటను జెప్పన్/ ఘాటుగ, నెప్పటికి గొప్పకాదులె వసుధన్/ మాటల తోడన్ కోటలు/ బీటలు చేయుటయనంగ పేలవముజుమీ!', 'మాట' విలువని కందంలో సంధించి అందిస్తున్నారు పృథ్వీ. తాత్వికత, ఆధ్యాత్మికత, ధార్మికత యిలా పలు అంశాల పోహళింపుతో వడ్డించిన పద్యవిందు ఇది. ఆస్వాదించండి..ఆనందించండి. **(ఇంద్రధనస్సు, రచన: ఎస్.ఆర్.పృథ్వీ, వెల: రూ 100, ప్రతులకు: పి.ఉషారాణి, 104-6-140, ఎంజి స్ట్రీట్, రామకృష్ణానగర్, రాజమహేంద్రవరం)** **– రమణ వెలమకన్ని**

ఆయుధం ఏం చేస్తుంది? ధరించిన వాడిని రక్షిస్తుంది. ఎదుటివాడిని శిక్షిస్తుంది. జీవనాధారానికి, స్వరక్షణకు వాక్కయినా, అస్త్రశస్త్రాలయినా ఆయుధాలే! అందరికీ తిండి పెట్టే రైతుకు సహకారం ఇచ్చేది నాగలి. దాన్ని నడిపించే ఎడ్లు.

బ్రతుకు పుస్తకంలో అనుభవ భావాలు

చక్కని అధ్యయనశీలి, చదవటం రాయటం జీవితంలో అంతర్భాగం చేసుకున్న, మూడు దశాబ్దాల నుంచి మంచి కవిత్వం వెలువరిస్తోన్న విల్సన్‌రావు కొమ్మువరపు కవితాసంకలనం ఇది. సరస్వతీ సమ్మాన్ కె.శివారెడ్డికి అంకితమీయబడిన ఈ సంకలనంలో 69 కవితలున్నాయి. తెలుగు సాహిత్యంలో చక్కని కవిత్వం సృష్టిస్తోన్న ప్రముఖులలో విల్సన్‌రావు ఒకరు అన్న వాదం నిర్వివాదాంశం. ఇది వీరి 4వ సంపుటి. నాగలిని ఆయుధంగా అందిస్తోన్న ఈ రచయితకు చక్కని అభినివేశం ఉంది. ఆచార్య కొలకలూరి ఇనాక్ తనముందు మాటలో చెప్పినట్లు వీరి కవిత్వం భిన్నార్థ బోధకం. ఈ కవితావాక్యాలు విశ్వసౌందర్యం చూపుతాయి. అదృశ్యలోక సౌందర్యం చదువరుల్ని తపింపచేస్తుంది. చదివి ఆనందించే అమృతవాక్యాలు ఈ కావ్యసంపుటి నిండా కనిపిస్తాయి. ప్రతి ఖండికా పరమ రమణీయంగా ఉంటుంది. నూటికినూరుపాళ్లూ నిజం. **(నాగలి కూడా ఆయుధమే..! కవిత్వం, రచన: విల్సన్‌రావు కొమ్మువరపు, వెల: రూ 200, ప్రతులకు: నవతెలంగాణ, నవోదయ బుక్‌హౌస్‌లు)** **– కూర చిదంబరం**

సూర్యాస్తమయం లేని దేశాలు

షేక్ అబ్దుల్ వాహీం జాని

ప్రతిరోజు మనం సూర్యోదయాన్ని చూస్తూనే ఉంటాం. ప్రకృతిలో దాగి ఉన్న వింతలను తెలుసుకోడాన్ని నిత్యం శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తూనే ఉంటారు. ఈ వింత విషయాలను తెలుసుకోవడానికి ప్రజలు కూడా నిత్యం ఆసక్తి చూపిస్తూనే ఉంటారు. భారతదేశంలో మొదటి సూర్యోదయ రాష్ట్రం అరుణాచల్‌ప్రదేశ్. ఇక్కడి అంజావు జిల్లాలోని డాంగ్‌వ్యాలీ అనే గ్రామంలో మొదట సూర్యుడు ఉదయిస్తాడు. ఈ పట్టణాన్ని జపాన్ ఆఫ్ ఇండియా అని పిలుస్తారు. ఈ గ్రామంలో ఉదయం 5 గంటలకే సూర్యుడు ఉదయిస్తాడు. జూన్ నెలలో అయితే ఉదయం 4.30గంటలకే సూర్యుడు ఉదయిస్తాడు. సాయంత్రం నాలుగున్నరకే అస్తమిస్తాడు. ఈ ప్రదేశం సముద్రమట్టానికి 1,240 మీటర్ల ఎత్తులో ఉండి నదులు, పర్వతాలతో నిండి ఉంటుంది. ఇది చైనా, మయన్మార్ దేశాల మధ్య నెలకొని ఉంది. బ్రహ్మపుత్ర నదికి ఉపనది అయిన రోహిత్ సంగమం ఈ ప్రాంత శోభను ద్విగుణీకృతం చేస్తుంది. తొలి సూర్యకిరణాలు తిలకించడానికి పర్యాటకులు డాంగ్ గ్రామానికి సమీపంలో ఉన్న తేజు, వాలాంగ్ పట్టణాలలో బసచేసి తెల్లవారుఝామున మూడుగంటలకే డాంగ్ గ్రామానికి ప్రయాణమౌతుంటారు. భారతదేశంలో చివరగా సూర్యాస్తమయం జరిగే ప్రదేశం గుజరాత్‌లో కచ్ జిల్లాలోని గుహార్ మోతీ. గుజరాత్ భారతదేశానికి పశ్చిమ దిక్కుగా ఉంది. జూన్‌మాసంలో అయితే ఇక్కడ రాత్రి 7.39 గంటలకు సూర్యుడు అస్తమిస్తాడు. ఉత్తర, దక్షిణ ధృవాల భూమి 83 డిగ్రీలు కొద్దిగా వంగి ఉంటుంది. ఈ కారణంగా భూమి తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ కూడా తిరగడంతో ఉత్తర, దక్షిణ ధృవాల్లో సూర్యకాంతి పడుతూనే ఉంటుంది. అందువల్ల అక్కడి వారికి చీకటి అంటే ఏమిటో తెలియదు. అందువల్ల ఆయా ప్రాంతాలలో వాతావరణంతోపాటు ప్రజల జీవనవిధానం భిన్నంగా ఉంటాయి.

తొలి సూర్యోదయం ఎక్కడ?

ప్రపంచంలో మొట్టమొదటగా సూర్యుడు జపాన్‌లో ఉదయిస్తాడని అందరం చదువుకున్నాం. అమెరికాలోని సమోవా అనే ప్రాంతంలో అందరికన్నా చివరిగా సూర్యోదయం అవుతుంది. ప్రపంచంలో న్యూజిలాండ్‌దేశంలో ఉత్తరాన ఉన్న గిస్‌బోర్న్‌లో మొట్టమొదట సూర్యోదయం అవుతుంది అని నేడు కొందరు శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసి చెబుతున్నారు. నిజానికి సూర్యుడు ఒకచోట స్థిరంగా ఉంటాడని, భూమి సూర్యుని చుట్టూ తిరుగుతుందని శాస్త్రవేత్తలు ఏనాడో తెలిపారు. సూర్యుని చుట్టూ తిరిగే భూమి తనలో తాను తిరుగుతుందనే విషయం తెలిసిందే. అయితే సూర్యుడు ముందుగా ఎక్కడ ఉదయిస్తాడో తెలుసా? దీనికి సైన్స్ అత్యంత ఆసక్తికర సమాధానాన్ని తెలిపింది. భూమిపై తొలి సూర్యోదయం జపాన్‌లో జరుగుతుందని చెబుతారు. ప్రపంచంలోని అన్ని దేశాలు జీఎంటీ (గ్రీన్‌విచ్ మీన్ టైమ్)ను ప్రామాణికంగా తీసుకుంటాయి. కాలాన్ని లెక్కలోనికి తీసుకోవడం వల్ల ప్రథమ సూర్యోదయం అనేది న్యూజిలాండ్‌కే దక్కుతుందని అంటారు. న్యూజిలాండ్‌లో సమయం జిఎంటీ 13. జపాన్ సమయం జీఎంటిం 9. న్యూజిలాండ్‌లో ఉదయం 6గంటలయినప్పుడు జపాన్‌లో రాత్రి 2గంటలవుతుంది. అదేవిధంగా ప్రపంచంలో తొలి న్యూఇయర్ వేడుకలు న్యూజిల్యాండ్‌లో జరుగుతాయి. ఈ నూతన టైమ్‌జోన్‌ను అనుసరించి ప్రపంచంలో తొలి సూర్యోదయం న్యూజిలాండ్‌లో జరుగుతుంది. దీని ప్రకారం జపాన్‌లో తొలి సూర్యోదయం జరగక పోయినప్పటికీ అక్కడే తొలి సూర్యోదయం అవుతుందని ఎందుకంటారనే ప్రశ్న మన మదిలో మెదులుతుంది. ఇటాలియన్ వ్యాపారి, అన్వేషకుడు మార్కోపోలో 13వ శతాబ్దంలో జపాన్‌ను పశ్చిమ దేశాలకు పరిచయం చేశారు. నిజానికి అతను ఎన్నడూ జపాన్ యాత్ర చేయలేదు. చైనాలోని దక్షిణ ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడి ప్రజలు అతనికి జపాన్ గురించి తెలిపారు. దక్షిణ చైనావాసుల అభిప్రాయం ప్రకారం జపాన్ అనేది మార్కోపోలో యాత్ర చేసిన మార్గంలో ఉంది.

అక్కడే సూర్యుడు మొదట ఉదయిస్తాడనేది ఆది నుండి వస్తుంది. అందుకే జనం జీ-పంగ్, జూ-పంగ్ అని అంటారు. దీని అర్థం సూర్యుడు ఉదయించే ప్రాంతం. గ్రీన్‌విచ్ మీన్ టైమ్‌ను ప్రామాణికంగా తీసుకోకపోతే సూర్యోదయ మొదటి భూమి జపాన్. సూర్యోదయం కాగానే మనిషి దైనందిన కార్యక్రమాలలో పరుగులు తీస్తుంటాడు. సూర్యాస్తమయం చేరగానే ఇల్లు చేరి విశ్రాంతి తీసుకుంటాడు. చాలా దేశాలలో పగలు, రాత్రి అనేవి ఉంటాయి. కొన్ని దేశాలలో చాలా నెలలు పగలు ఉంటుంది. కొన్ని దేశాలలో రాత్రి అనేది అరుదుగా కనిపిస్తుంది. ఇది విన్న వారు ఆశ్చర్యపోతుంటారు. అక్కడి ప్రజలు ఎలా నిద్రపోతారు? వా రి దైనందిన కార్యక్రమాలు ఎలా ఉంటాయి? అనే విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తి కలిగి ఉంటారు.

ప్రపంచంలో సూర్యుడు అస్తమించని దేశాలు

ప్రపంచంలోని చాలా ప్రదేశాలు దాదాపు 12గంటల పగలు, 12 గంటల రాత్రి ఉంటుంది. కొన్ని దేశాలలో హెచ్చురోజులు సూర్యుడు ఉంటాడు. రాత్రి అనేది ఉండదు. ప్రజలు తమ 24 గంటలను ఏ పనికి ఎలా కేటాయించాలో విభజించుకుని తదనుగుణంగా వారి షెడ్యూల్‌ను రూపొందించుకుంటారు. చాలా రోజులు పగలే అధికంగా ఉన్న దేశాలలో గడియారాన్ని అనుసరించడం పరిపాటి. భూమి సూర్యునికి సంబంధించి వంపుతిరిగిన అక్షం వద్ద తిరుగుతుంది. వేసవి నెలలలో ఉత్తర ధ్రువం మన నక్షత్రం వైపు కోణంలో ఉంటుంది. అందుకే చాలా వారాలపాటు, సూర్యుడు ఆర్కిటిక్ సర్కిల్ పైన ఎప్పుడూ అస్తమించడు. ఇక్కడ గడియారం లేనిదే రాత్రి, పగలుకు తేడా తెలియదు.

నార్వే: నార్వేలో అర్ధరాత్రి సూర్యుడు ఎక్కువకాలం ఉండే ప్రదేశం స్వాల్‌బార్డ్. నార్వేని 'అర్ధరాత్రి సూర్యుని భూమి' అని పిలుస్తారు. నార్వే ఆర్కిటిక్ సర్కిల్‌లో ఉన్న దేశం. మే నెలల నుండి జూలై చివరి వరకు సూర్యాస్తమయం అంటే ఏమిటో తెలియదు. వేసవికాలంలో నార్వేలో 76 రోజుల పాటు 24గంటలు పగటి వెలుగు ఉంటుందని అంచనా. ఐరోపాలో ఉత్తరాన నివసించే ప్రదేశమైన స్వాల్‌బార్డ్ అనే ప్రదేశంలో ఏప్రిల్ 10 నుండి ఆగస్టు 23వరకు సూర్యుడు నిరంతరం ప్రకాశిస్తూనే ఉంటాడు. అందుకే నార్వేని 'ల్యాండ్ ఆఫ్ ది మిడ్‌నైట్ సన్' అని పిలుస్తారు. ఇక్కడి ప్రజలు గడియారం చూసుకునే తమ దైనందిన కార్యక్రమాలలో పాల్గొంటారు. అర్ధరాత్రి సూర్యుడు ప్రకాశిస్తూనే ఉంటాడు. అయినా జనం రోడ్లపై తిరగరు. పర్యాటకులు మాత్రం ఈ వింతను చూడడానికి తిరుగుతుంటారు. అర్ధరాత్రి తరువాత సూర్యుడు అలా వెళ్లి ఇలా చటుక్కున వచ్చేస్తాడు. భూమిపై 70రోజుల కంటే ఎక్కువ సూర్యుడు అస్తమించని కొన్ని ప్రత్యేకమైన ప్రదేశాలు ఉన్నాయి. సంవత్స రంలో కొంత భాగం సూర్యుడు అస్తమించని మరి కొన్ని ప్రదేశాల గురించి తెలుసుకుందాం.

అలాస్కా: అలాస్కా ఉత్తర అమెరికాలో ఉంది. నిత్యం మంచుతో కప్పివుండే ఈ ప్రాంతం వేసవిలో సూర్యాస్తమయం లేని ప్రాంతంగా మారిపోతుంది. మే చివరి నుండి జూలై చివరి వరకు రెండునెలలు నిత్యం సూర్యుడు ప్రకాశిస్తూనే ఉంటాడు. అర్ధరాత్రి కూడా సూర్యాస్తమయం జరగదు. అందువల్ల అలాస్కాన్ లాండ్ ఆఫ్ ది మిడ్‌నైట్ సన్ అని పిలుస్తారు. అయితే శీతాకాలం ప్రారంభమైన నవంబర్ నుండి 30 రోజుల కంటే ఎక్కువ సూర్యుడు కనిపించడు. ఆ సమయంలో 'ధ్రువరాత్రి' అని పిలుస్తారు.

ఫిన్‌లాండ్: యూరప్‌లోని ఫిన్‌లాండ్ ఏడాది పొడవునా మంచుతో కప్పబడి ఉంటుంది. వేసవిలో ఫిన్‌లాండ్ దేశం మొత్తం 73 రోజులు సూర్యుడు అస్తమించడు. ఈ 73 రోజులు సూర్యకాంతి నిత్యం ప్రసరించడం వింతగా చెప్పవచ్చు. అందుకే ఫిన్‌లాండ్‌ను లాండ్ ఆఫ్ మిడ్‌నైట్ సన్ అని పిలుస్తారు. చాలాకాలం పాటు 20 గంటలపాటు సూర్యుడు కనిపిస్తాడు. శీతాకాలంలో మొత్తం చీకటిలో ఉంటుంది. వేసవిలో ఫిన్‌లాండ్ ప్రజలు ఎక్కువ పని చేయడానికి, తక్కువ నిద్రపోవడానికి ఇదే కారణం.

ఐస్‌లాండ్: ఐస్‌లాండ్ ఉత్తర అట్లాంటాలోని ఒక ద్వీప దేశం. గ్రేట్ బ్రిటన్ తరువాత యూరప్‌లో ఐస్‌లాండ్ అతిపెద్ద ద్వీపం. ఇక్కడ మంచు పర్వతాలే కాదు అగ్ని పర్వతాలు కూడా ఉంటాయి. హిమానీ నదాలకు ఐస్‌లాండ్ పెట్టింది పేరు. ఐస్‌లాండ్‌లోని కొన్ని ప్రాంతాలు వేసవిలో ప్రతి ఏడాది మే 10 నుండి జులై చివరి వరకు ఐస్‌లాండ్ ప్రజలకు చీకటి అనే మాటే తెలియదు. అక్కడ అర్ధరాత్రి కూడా సూర్యుని వెలుగులు తగ్గకపోవడంతో రాత్రికి, పగటికి తేడా అనేది తెలియదు. ఆర్కిటిక్ సర్కిల్‌లో ఉన్న అకురేరి, గ్రిమ్సే వంటి నగరాలు అర్ధరాత్రి సూర్యుని అత్యంత వైభవంగా ప్రకాశిస్తూ ఉంటాడు. ఐస్‌లాండ్‌లో సూర్యకాంతి చంద్రకాంతి మాదిరి హాయిగా ఉంటుంది. ఇక్కడ కూడా రాత్రికి, పగలుకు సమయం అతి తక్కువగా ఉంటుంది. చీకటి పడింది అనుకునే లోపే తిరిగి సూర్యుడు కనిపిస్తాడు. అంటే సూర్యాస్తమయం జరిగింది అని తేరుకునే లోపే సూర్యోదయం అవుతుంది.

స్వీడన్: యూరప్‌లోని స్వీడన్‌లో మే ప్రారంభం నుండి ఆగస్టు చివరి వరకు మూడునెలలకుపైగా 20 గంటలపాటు నిరంతరం సూర్యుడు వెలుగులు విరజిమ్ముతాడు. కేవలం 4 గంటలు మాత్రమే రాత్రి ఉంటుంది. ఇక్కడ కొన్ని సందర్భాలలో 6 నెలలపాటు అత్యధిక సమయం సూర్యుని వెలుగు ఉంటుంది. స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్‌లో అర్ధరాత్రి 2గంటలకు సూర్యుడు అస్తమిస్తాడు. రెండు గంటల తరువాత అంటే 4గంటలకే సూర్యోదయం జరుగుతుంది. ఈ వింత స్వీడన్ దేశంలో రమారమి ఆరు మాసాలపాటు ఉంటుంది. ఈ వింతలు చూడటానికి ప్రపంచం నలుమూలల నండి పర్యాటకులు స్వీడన్‌కు వెళుతుంటారు.

కెనడా: వాయువ్య కెనడాలోని నునావట్ ఆర్కిటిక్ వృత్తానికి రెండు డిగ్రీల కంటే కొంచెం ఎక్కువ ఎత్తులో ఉంది. ఇక్కడ నెలల తరబడి సూర్యుని వెలుగు అత్యధిక సమయం ఉంటుంది. దాదాపు 56 రోజులు సూర్యాస్తమయం అంటూ ఉండదు. అదే స్థాయిలో చీకటి కూడా ఉంటుంది. చీకటి వెలుగులకు ఇది ప్రసిద్ధి. ఏప్రిల్ నుండి జూన్ వరకు ఇక్కడ వేసవి కాలం. ఈ సమయంలో ఈ ప్రాంతంలో 24గంటలు సూర్యరశ్మి ఉంటుంది. ఆ తరువాత డిసెంబర్ మధ్య నుండి జనవరి నెల మధ్య వరకు వరుసగా 30 రోజులపాటు

కథ

మట్టి విగ్రహం

రంగాపురం ఒక కుగ్రామం. మరో పదిహేను రోజుల్లో వినాయక చవితి పండుగ రాబోతున్నదన్న సంబరంలో, పిల్లలంతా కేరింతలు కొడుతూ, చందాల వసూళ్లకు తిరుగుతున్నారు. గ్రామానికి వచ్చి, వెళ్లేవాళ్లను వాహనాలను ఆపుతూ, వినాయక మండపాల ఏర్పాటుకు చందాలు అడుగుతూ డబ్బులు జమ చేస్తున్నారు. పిల్లల ఆసక్తిని గమనించిన గ్రామ యువకులు పిల్లలందరితో ఓ సమావేశం ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈసారి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనిక రంగులతో తయారు చేసిన విగ్రహాలు కాకుండా మట్టి విగ్రహాలు తయారు చేయించి, పండగకు వాటినే ప్రతిష్టించమని, తాము కూడా అందుకు సహకరిస్తామని తెలిపారు. ఈ సలహా నచ్చిన పిల్లలంతా మట్టితో విగ్రహాలు తయారు చేయించి, వినాయక చవితి పండుగకు వాటికే పూజలు చేయాలని నిర్ణయించారు. తమ తమ వీధులలో మండపాలు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలు ప్రతిష్టించాలని తీర్మానించి, ఏ వీధికావీధి సంఘాలు ఏర్పాటు చేసుకున్నారు.

ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన రంగయ్య అనే వ్యాపారి రాబోయే పండుగను పురస్కరించుకొని వినాయకుని ప్రతిమలు, విగ్రహాలను అమ్మకం కోసం, గ్రామానికి తీసుకురావడానికి సిద్ధమైనాడు. ఈ విషయం తెలిసిన యువకులు, గ్రామస్తులు రంగయ్యతో కాలుష్యం కారకాలైన రసాయనిక రంగుల విగ్రహాలు అమ్మకూడదని హెచ్చరించి, పర్యావరణ పరిరక్షణలో మీ సహకారం అందించాలని అతణ్ణి కోరారు. తనకు వ్యాపారమే బతుకుదెరువని, పండుగ రోజుల్లో గిరాకీ ఉండే విగ్రహాలు అమ్మవద్దంటే ఎలాగని? ప్రశ్నిస్తూ, తాను ఖచ్చితంగా వినాయక ప్రతిమలు తెచ్చి, అమ్మి తీరుతానని రంగయ్య భీష్మించాడు. రంగయ్యకు, యువజన సంఘం వారికి ఈ విషయంలో తీవ్ర వాగ్వాదం జరిగింది. గ్రామంలోని యువజన సంఘం ఆధ్వర్యంలో ఉత్సాహవంతులైన పెద్దలు, పిల్లలు వారి తీరిక సమయాల్లో మట్టితో ప్రతిమలు చేసి ఇస్తారని, వాటిని కొంత డబ్బు చెల్లించి వారి నుండి కొనుగలు చేసి, అమ్ముకొని వ్యాపారం చేసుకోవాలని సలహా ఇచ్చారు. ఇరువర్గాలు ఈ సూచనకు అంగీకరించారు. గ్రామ యువకులు, కొందరు పిల్లలు కలిసికట్టుగా కృషి చేసి, వందల సంఖ్యలో ప్రతిమలు తయారు చేసి, సరసమైన ధరకు రంగయ్యకు ఇచ్చి, వచ్చిన డబ్బులను పిల్లల సంఘాలకు సరిసమానంగా అందజేశారు. పిల్లలంతా వినాయక మండపాలు అలంకరించి, మట్టి ప్రతిమలను సిద్ధం చేసి, పండుగకు పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు.

ఈ విషయంలో సహకరించిన వ్యాపారి రంగయ్యకు, ప్రతిమల తయారీలో చొరవ చూపిన పిల్లలు, యువకులకు సర్పంచ్, గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలియజేశారు. మొత్తానికి రంగాపురంలో వినాయక చవితి పండుగ రోజు పర్యావరణహితంగా మట్టి విగ్రహాలతో గణపయ్య పూజందుకోబోవడాన్ని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కూడా అభినందించారు.

– నాగరాజు కామర్సు

బాలగేయం

విజయం

లేదు లేదు లేనే లేదు
విజయానికి లేదు
దగ్గర దారి
పట్టుదలతో కృషి
చేయడమే
విజయానికి ఉన్న
ఏకైక మార్గం
నిలబడి పైకి
చూస్తూఉంటే
ఎక్కలేవు ఉన్నత శిఖరం
జాగు చేయక
బయలుదేరితే
ఒక్కొక్క మెట్టును
ఎక్కేయగలవు
పిరికి తనమే
ప్రథమ శత్రువు
ధైర్యంతోనే ఓడించుదాన్ని
ఏదేమైనా ఎవరేమన్నా
లక్ష్యపెట్టకు
లక్ష్యం వీడకు
విజయం ఎవరికీ
సొంతం కాదు
ప్రయత్నం చేసే
ప్రతి ఒక్కరిది
శ్రమే నీకు ఆయుధమైతే
విజయం నీకు
బానిస అగును.

– డా॥దార్ల బుజ్జిబాబు

హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

గిరీష్ అంకుల్ సమాధానాలు

- బి.కార్తిక, తిరుత్తణి

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. పదార్థాలను వేడి చేసినప్పుడు వ్యాకోచిస్తాయి. చల్లబరిచినప్పుడు సంకోచిస్తాయి. కారణం ఏమిటి?

జవాబు: కార్తిక: ప్రతి పదార్థమూ లక్షల కొద్దీ అణువుల(మాలిక్యూల్స్)తో నిర్మితమై ఉంటుంది. ఈ అణువులు వివిధ దిశల్లో వేగంగా కదులుతుంటాయి. ఒక పదార్థాన్ని వేడి చేసినప్పుడు అణువులు శక్తిని పుంజుకొని, అత్యంత వేగంగా కదలడం ప్రారంభించి తమ పరిధిని విస్తరించుకుంటాయి. దాన్నే మనం పదార్థ వ్యాకోచం అంటాం. పదార్థాన్ని చల్లారిస్తే పై చర్యకు భిన్నంగా జరుగుతుంది. పదార్థంలోని అణువులు శక్తిని కోల్పోయి, నెమ్మదిగా కదులుతూ, తమ పరిధిని తగ్గించుకుంటాయి. దానినే మనం పదార్థం సంకోచించిందని అంటాం. అయితే నీటి విషయంలో ఈ సంకోచ వ్యాకోచ పద్ధతులు భిన్నంగా ఉంటాయి. నీటిని నాలుగు డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతకు చల్లారిస్తే అది సంకోచించడానికి బదులుగా వ్యాకోచిస్తుంది. సున్నా డిగ్రీల వరకూ అలా వ్యాకోచించి అక్కడ ఘనీభవించి ఐస్‌గా మారుతుంది. సాధారణంగా వంతెనలు వేసవి కాలంలో వేడెక్కిపోతాయి. ఈ కారణంతో నిర్మాణ సమయంలోనే ఒక వైపు వ్యాకోచానికి అనువుగా ఉండే ఏర్పాటు చేస్తారు.

- సి.నీరజ్, గుంటూరు

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. హిమాలయాలు ఏర్పడక ముందు అక్కడ ఏమి వుండేది?

జవాబు: నీరజ్! మన దేశానికి ఉత్తర దిక్కులో వున్న హిమాలయాల భాగంలో అతి ప్రాచీన కాలంలో టెథీస్ సముద్రం వుండేది. ఈ కారణంతోనే టిబెటన్ (టెథీస్) హిమాలయాలని ఒక దిశగా వున్న వాటిని పిలుస్తారు. మిగిలినవి గ్రేటర్ హిమాలయాలు (హిమాద్రి), లెస్సర్ హిమాలయాలు (హిమాచల్), శివాలిక్ కొండలు. ఉత్తర, దక్షిణాలుగాపర్వత పంక్తులతో హిమాలయాలు వున్నాయి.

సాధన చేస్తే గణితం సులభమే!

ననుబోలు రాజశేఖర్

గణితం..గణితం..ఈపదం కొంతమంది విద్యార్థులకు ఉత్సాహాన్ని కలిగిస్తే, మరి కొంతమందికి భయాన్ని (ఫోబియా) కలిగిస్తుంది. ఫోబియా అనేది వాస్తవికమైనది కాదు. ఒక ఊహాజనితమైనది. కొంతమంది మనుషుల్లో ఉండే అనేకరకాల భయాల మాదిరి గానే కొంతమంది విద్యార్థుల్లో గణిత భయం (మ్యాథ్స్ ఫోబియా) ఉంటుంది. ఈ మ్యాథ్స్ ఫోబియా వలన, గణితం అంటే చాలాకష్టం. అది మనకు ఎప్పటికీ రాదు అనే అపోహ కొంతమంది విద్యార్థుల మనసుల్లో గూడుకట్టుకుని ఉంటుంది. ఈ అపోహ వలన మ్యాథమెటిక్స్ కోర్సులలోనే కాకుండా, మ్యాథమెటిక్స్ అప్లికేషన్స్‌తో సంబంధం ఉన్న ఇతర కోర్సులలో, పోటీ పరీక్షలలో కూడా విద్యార్థులు వెనుకబడుతున్నారు. ఈ వెనుకబాటు తనం విద్యార్థుల మంచి భవిష్యత్తుపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. మ్యాథ్స్ ఫోబియా విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి ఉద్యోగావకాశాలకు ఆటంకంగా మారుతుంది. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం చేసిన ఒక అధ్యయనం, గణిత సమస్యలను పరిష్కరించగల ఆత్మవిశ్వాసం ఉన్న విద్యార్థులు, మ్యాథ్స్ ఫోబియా ఉన్న విద్యార్థుల కంటే ఎక్కువ తార్కిక నైపుణ్యాలను, సృజనాత్మకతను కలిగి ఉంటారని నిరూపించింది. అసలు, ఈ మ్యాథ్స్ ఫోబియా అంటే ఏమిటి దానిని అధిగమించే మార్గాలను గురించి మనం తెలుసుకుందాం.

గణితం భయం (మ్యాథ్స్ ఫోబియా) లక్షణాలు

గణిత సమస్యలను సాధిస్తున్నప్పుడు మీకు చెమట పట్టుతుందా? అయితే, మీకే కాదు, 'మ్యాథ్స్ ఫోబియా'తో బాధపడే చాలామందిలో ఈ లక్షణం సర్వసాధారణం. కొన్ని సర్వేల ప్రకారం 7 నుండి 10 తరగతులలో 82శాతం మంది విద్యార్థులు మ్యాథ్స్ ఫోబియాతో భయపడుతున్నారని వెల్లడయింది. ప్రతి 10మంది విద్యార్థులలో ఒకరు మాత్రమే వారి గణిత సామర్థ్యంపై నమ్మకాన్ని కలిగి ఉన్నారని ఈ సర్వేలు చెబుతున్నాయి. ఈ మ్యాథ్స్ ఫోబియా సరైన సాధన లేకపోవడం వల్ల విద్యార్థులలో విస్తృతంగా వ్యాపిస్తుంది. మ్యాథ్స్ ఫోబియా అనేది గణిత శాస్త్రం పేరు వింటేనే విద్యార్థులలో తెలియకుండానే కలిగే ఒక భయం లేదా ఆందోళన. మ్యాథ్స్ ఫోబియాతో ఆందోళనకు గురౌతున్న విద్యార్థులు ఏకాగ్రతతో సాధన చేయలేక గణిత సంబంధిత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోతున్నారు. మ్యాథ్స్ ఫోబియా ఉన్న విద్యార్థులు విషయాలను అవగాహన చేసుకుని సమస్యలను సాధించడం కంటే, సమస్యలకు సంబంధించిన సమాధానాలను కంఠస్థ పద్ధతి ద్వారా గుర్తుపెట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. మ్యాథ్స్ ఫోబియాతో బాధపడే విద్యార్థులకు, గణిత సంబంధిత సబ్జెక్టులు పెద్ద భూతంలాగా కనిపిస్తాయి. అంతేకాదు, గణితశాస్త్రంలోని అంశాలను అర్థం చేసుకుని, సంబంధిత సమస్యలను సాధించే ప్రయత్నం చేయకుండానే, ఆ అంశాలు తమకు అర్థం కానివని, ఆ సమస్యలను తాము సాధించలేమనే అపోహలతో విద్యార్థులు సతమతమవుతుంటారు. గణితం పట్ల సరైన అవగాహన, సంసిద్ధత, ఆత్మవిశ్వాసం లేకపోవడం వలన చాలామంది విద్యార్థులు గణితంలో పూర్తిగా విఫలమవుతున్నారు. ఇలా విఫలమవుతున్న విద్యార్థులు, తమకు గణితశాస్త్రం చదివే సామర్థ్యం లేదనుకుని గణితశాస్త్రం పట్ల పెద్ద భయాన్ని సృష్టించుకుంటారు.

దీనినే మనం 'గణిత భయం (మ్యాథ్స్ ఫోబియా) అని అంటాం.

మ్యాథ్స్ ఫోబియా కారణాలు

ప్రాథమిక విద్యనుండే 'మ్యాథ్స్ ఫోబియా' విద్యార్థుల మనసుల్లో ప్రవేశించడానికి అనేక కారణాలు ఉన్నాయి.

ప్రాథమిక విద్యలోనే బీజం: ప్రాథమిక విద్యలోనే గణితశాస్త్రాన్ని చదవడానికి సరైన బోధన అవసరమైన ప్రోత్సాహం లభించక, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవడం వలన చిన్న వయసులోనే చాలామంది విద్యార్థుల మనసుల్లోకి మ్యాథ్స్ ఫోబియా ప్రవేశిస్తుంది. ఇలా ప్రవేశించిన ఈ ఫోబియా పెరిగి పెద్దదై విద్యార్థులకు గణితం పట్ల ఆసక్తి లేకుండా చేస్తుంది.

➡ గణితశాస్త్ర కఠినమైనదనే భావన: తల్లిదండ్రులు, చుట్టూ ఉన్నవారు తరచుగా గణితం చాలా కష్టమైనదని చర్చించుకోవడంతో, చాలామంది విద్యార్థులు చిన్న వయసులోనే, గణితం అర్థం కాని సబ్జెక్ట్ అని, అది చాలా కష్టమైనదని, మనం చదవలేమనే భావనకు లోనౌతున్నారు. ఈ భావనే విద్యార్థులకు చిన్న వయసులోనే గణితం పట్ల భయాన్ని కలిగిస్తుంది.

➡ బోధనా పద్ధతుల్లో లోపాలు: కొందరు ఉపాధ్యాయులు ఉపయోగించే బోధనాపద్ధతులు సరైనవిగా లేనప్పుడు, విద్యార్థులు విషయాలను సులభంగా గ్రహించలేక ఆందోళనకు గురవుతుంటారు. అలాగే, ఉపాధ్యాయులు గణితశాస్త్రం గురించి విద్యార్థులకు సరైన అవగాహన కల్పించలేకపోవడం కూడా మ్యాథ్స్ ఫోబియాకి దారితీస్తుంది.



➡ భయపెట్టే గణిత ఖచ్చితత్వం: గణితం అనేక సంఖ్యల ఆట, దీనిలో విద్యార్థులు సమస్యలకు ఖచ్చితమైన సమాధానాలను రాబట్టవలసి ఉంటుంది. సరైన సాధన చేయకపోవడం వల్ల, గణిత సమస్యలను సాధిస్తున్నప్పుడు ఖచ్చితమైన సమాధానాలను రాబట్టలేక విద్యార్థులు గణితం అంటే భయపడుతున్నారు.

మ్యాథ్స్ ఫోబియాని ఎలా అధిగమించాలి?

అనుసరించడానికి సులభతరమైన ఈ చిట్కాలతో నివారణలతో మ్యాథ్స్ ఫోబియాను అధిగమించవచ్చు.

➡ విద్యార్థుల్లో సానుకూల దృక్పథాన్ని పెంపొందించాలి. 'నేను చేయలేను', 'గణితం నా సబ్జెక్ట్ కాదు', 'గణితం చేయడం చాలాకష్టం' అనే ఆలోచనలు విద్యార్థులకు గణితం పట్ల భయాన్ని పెంచి ఆసక్తిని తగ్గిస్తాయి. అందువల్ల గణితాన్ని బోధించడానికి ముందే ఇలాంటి ఆలోచనలను విద్యార్థుల మనసుల్లో నుంచి ఉపాధ్యాయులు చెరిపివేయాలి. అలాగే, ఉపాధ్యాయులు విద్యార్థులకు, వారు తమ మనసులో నేను చేయగలను అని అనుకుంటే ఏదైనా చేయగలరని, గణితం సులభంగా, సరదాగా ఉంటుందని', సరైన విధానంతో ఎలాంటి గణిత సమస్యనైనా సులువుగా పరిష్కరించవచ్చని' చెప్పి వారికి గణితం పట్ల ఆసక్తిని కలిగించాలి.

➡ మ్యాథ్స్ ఫోబియా గుర్తించి స్వేచ్ఛగా మాట్లాడాలి: విద్యార్థులు తమ గణిత భయం గురించి స్వేచ్ఛగా మాట్లాడేలా ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలి. గణితశాస్త్రంపై విద్యార్థులకు ఉన్న అభిప్రాయాలను అడిగి తెలుసుకోవాలి.

➡ శ్వాస వ్యాయామాలు

గణిత ఆందోళన ఎక్కువగా ఉన్నప్పుడు, శ్వాసపై దృష్టి పెట్టడం ద్వారా మనస్సును స్థిరీకరించవచ్చును. విద్యార్థులు లోతైన శ్వాసను తీసుకొని, శ్వాసపై దృష్టి కేంద్రీకరించి, కొద్దిసేపు ధ్యానంలో ఉండటం వలన వారి మనసు కుదుటపడుతుంది. ఆ తర్వాత ఉపాధ్యాయులు విద్యార్థులను వారి మనసులో గణితాన్ని నేర్చుకోవడంలో నాకు సౌకర్యం ఉంది. నేను గణితంలో విఫలం కాను, నేను సమర్థుడైన గణిత అభ్యాసకుడిని, గణితం నా భవిష్యత్తుకు సహాయపడుతుంది అని సంకల్పం చేసుకోమని సూచించాలి.

సాధనే కీలకం: గణితంలో ఎంత ఎక్కువ సాధన చేస్తే, అంత మెరుగైన ప్రావీణ్యతను పొందగలరు. గణితంపై పట్టు సాధించడానికి సాధన ఒక్కటే ఉత్తమమైన మార్గం. సాధనతోనే గణిత భయాన్ని జయించవచ్చు. గణితానికి సంబంధించిన ప్రాథమిక భావనలను (బేసిక్ కాన్సెప్ట్స్) పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే, విద్యార్థులు గణిత సమస్యలను సొంతంగా సాధన చేయాలి.

➡ గణితం తేలికగా, సరదాగా ఉంటుందనే భావన కల్పించాలి. నిజానికి, గణిత సమస్యలు కొంత సంక్లిష్టంగానే ఉంటాయి. గణితంలో ఉండే ఈ సంక్లిష్టతే మనిషి మేధస్సుకు విశ్లేషణాత్మక పరిజ్ఞానాన్ని, సృజనాత్మకతను అందిస్తుంది. అదే సంక్లిష్టత విద్యార్థులను భయపడేతుంది.

సృజనాత్మకతతో గణితాన్ని నేర్పాలి: ఉపాధ్యాయులు కొన్ని సృజనాత్మక కార్యకలాపాల ద్వారా గణితానికి సంబంధించిన అంశాలను వివరిస్తే, విద్యార్థులు మరింత సులభంగా అర్థం చేసుకుంటారు. దీనికోసం గణితానికి సంబంధించిన అంశాలలో చిన్నచిన్న ప్రాజెక్ట్స్‌ను, పోస్టర్స్‌ను, పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్స్‌ను, ఇతర సృజనాత్మక కార్యకలాపాలను తయారు చేయమని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచించాలి. ఇలాంటి సృజనాత్మక కార్యకలాపాలు విద్యార్థులకు గణితం పట్ల ఆసక్తిని కలిగిస్తాయి.

ముగింపు సారాంశం

ఆర్థిక అక్షరాసత్య, వృత్తి అవకాశాలు, సమస్య పరిష్కార నైపుణ్యాలు, విమర్శనాత్మక ఆలోచన, విశ్లేషణాత్మక నైపుణ్యాలు, సాంకేతిక పురోగతి, శాస్త్రీయ ఆవిష్కరణలు, సృజనాత్మకత, రోజువారీ కొలతలు, ఇంజనీరింగ్, వైద్య, ఆరోగ్యశాస్త్రాలు, పర్యావరణ అధ్యయనాలు, పరిరక్షణ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాణిజ్యం, అంతరిక్ష అన్వేషణ, నావిగేషన్ మొదలైన రంగాలలో గణితశాస్త్రానికి సంబంధించిన అనేక అనువర్తనాలు ఉన్నాయి. గణితాన్ని ఉపయోగించని వృత్తి, విభాగం ప్రపంచంలో ఏదీ లేదు. అందుకే, గణితాన్ని 'క్వీన్ ఆఫ్ ఆల్ సైన్సెస్', 'ది లాంగ్వేజ్ ఆఫ్ ది యూనివర్స్' అని అంటారు. ఇంతటి ప్రాముఖ్యతను కలిగిన గణితాన్ని ప్రేమిస్తూ, శోధిస్తూ సాధించాలి. ■



కథ

డా॥ దేవులపల్లి పద్మజ

సార్థకత

సంధ్యా సమయం.. ప్రశాంతంగా సోఫాలో కూర్చుని పూవులు మాల కడుతూ టీ.వి. చూస్తోంది సుహాసిని. కూతురు దివ్య స్నేహితురాళ్లతో సినిమాకి వెళ్లింది. కొడుకు భరత్ క్రికెట్ గ్రౌండ్‌కి వెళ్లాడు. భర్త ఆఫీసు నుంచి లేటుగా వస్తాడు. ఎకౌంట్స్ క్లోజింగ్ అవటం వలన ఈ నెలంతా అలాగే వుంటుంది అతని షెడ్యూల్. పని చేసేసి త్వరగా వెళ్లిపోయింది పనిమనిషి.

ఇంతలో లేండ్‌ఫోను మోగింది. ఒడిలోని పూవులను పక్కన పెట్టి కార్నర్ టేబుల్ దగ్గరికి వచ్చింది. ఫోను ఆగిపోయింది. రెండు నిమిషాలు అక్కడే నుంచుని ఎదురు చూసింది. తిరిగి ఫోన్ రింగ్ అవలేదు. వెనక్కి వచ్చేసింది. రింగ్ అవటం, ఆగిపోవటం.. ఇలా రెండు మూడు సార్లు జరిగింది. విసుగొచ్చి ఇక పట్టించుకోవటం మానేసింది.

వెనక్కి వచ్చి కూర్చుని తన పనిలో మునిగిపోయింది. ఇంతలో భర్త రఘురామ్ రావటం చూసి ఆగిపోయింది. నేను చూస్తున్నది నిజమేనా? ఊహా? అనుకుంటూ కనుబొమలు ముడిచేసి భావాన్ని ప్రకటించింది. దానికి సావధానంగా "నేనేనోయ్... నిజమే. నేనే... రఘురామ్‌ని. నీ పతిదేవుడిని.. రానిస్తావా?? నేను ఫోను చేస్తే ఎవరూ పట్టించుకోలేదు" అన్నాడు నవ్వుతూ.

బ్యాగ్ పక్కన పెట్టి రిఫ్రెష్ అయి వచ్చాడు.

చిరునవ్వుతో కాఫీ తెచ్చి భర్త చేతిలో పెట్టింది సుహాసిని. ఏమిటి విషయం.. ఏమీ లేకుండా త్వరగా రారే! ఇల్లూ ఇల్లాలు ఇంత త్వరగా గుర్తుకొచ్చాయి. ఏమిటో సెలవిస్తారా?" అంది కాస్త వెటకారం జోడిస్తూ పక్కనే కూర్చుంటూ.

"సరేకానీ, మన దివ్య ఫ్రెండ్ శ్యామలగారు, మూర్తిగారు వస్తానన్నారు. ఎందుకో తెలుసుకోవాలి కదా! మీతో మాట్లాడాలి, ఏ టైములో వుంటారు, ఎపుడు రమ్మంటారు? అని అడిగితే ఈ సమయంలో రమ్మనమని చెప్పాను. ఇద్దరూ కులాసా కబుర్లు చెప్పుకునేంతలో రానే వచ్చారు మూర్తిగారు.

"నమస్కారం మూర్తిగారు.. రండి!" అంటూ సోఫా చూపించాడు.

"నమస్కారం రఘురాంగారూ! అమ్మా, కులాసాగా వున్నారా?" అని వారిద్దరినీ పలకరించారు మూర్తిగారు.

లోపలికి వెళ్లి మంచినీళ్లు తెచ్చింది సుహాసిని. వారిద్దరూ మాట్లాడుకుంటూ వుంటారు. మధ్యలో తను అక్కడ వుండటం ఎందుకని లోపలికి వెళ్లి స్టౌ మీద పాలు పెట్టింది. పళ్లెంలో అల్పాహారం పెట్టి, వారిద్దరికీ తెచ్చి టీపాయ్ మీద పెట్టింది. పది నిమిషాల తరువాత టీ కలిపి తీసుకుని వచ్చి అక్కడ పెట్టి వెళ్లిపోబోతుంటే–

"అమ్మా! ఒక్క నిమిషం" అన్నారు.

ఏమి చెప్తారోనని అటుగా చూసింది. ఎమ్మెస్ చేస్తానని మా అమ్మాయి శ్యామల గొడవ చేస్తోంది. ఏవేవో పరీక్షలు రాస్తోంది. నాకు వేరే దేశాలు పంపించడం ఇష్టంలేదు. కానీ ఇంట్లో అందరూ పంపించి చదివించటానికే మొగ్గు చూపుతున్నారు. నాకు ఆ విషయాలేవీ తెలీదు. మీరు దివ్యని కూడా పై చదువులకు విదేశాలు పంపిస్తున్నారా? ఇప్పుడు కలిసే చదివే స్నేహితురాళ్లిద్దరూ ఇక ముందు కూడా కలిసే వుండేలా ఏర్పాటు చేద్దాం. ఒకరికి ఒకరు తోడుగా వుంటారు. ఏర్పాట్లు అవ్వీ మీరే ఇద్దరికీ ఒకేసారి చేసేద్దురూ" అన్నారు మూర్తిగారు.

అంతా విని రఘురామ్ "నేను దివ్యతో మాట్లాడి తను ఏం చెయ్యాలనుకుంటోందో ఏమిటో తెలుసుకుని చేద్దాం" అన్నారు.

"సరేనని" తలూపారు మూర్తిగారు.

ఇంతలో భరత్ వచ్చాడు.

"డాడీ! నేను లేటుగా వచ్చానా? మీరు త్వరగా వచ్చారా?" అన్నాడు కళ్లు పెద్దవి చేసుకుని. బ్యాగ్ పక్కన పెట్టి తండ్రి సమాధానానికి ఎదురు చూడకుండా లోపలికి వెళ్లిపోయాడు.

మూర్తిగారిని పంపించి వచ్చి "దివ్య ఎప్పుడు వస్తుంది? ఫస్ట్ షో సినిమా అయ్యేసరికి దగ్గర దగ్గర పదైపోతుంది" అన్నాడు రఘు భార్యకేసి చూస్తూ.

వాళ్లందరూ కలిసి మౌనిక కారులో వెళ్లారు. తిరిగి అలాగే ఇంటికి వచ్చేస్తారు. సంవత్సరం తరువాత కదా వెళ్లిన సినిమా, వాళ్లకి నచ్చినట్లే వెళ్లారు, జాగ్రత్తగా వచ్చేస్తారు.. బెంగ పడనక్కరలేదు" అంది సుహాసిని.

కూతురు దివ్య రానే వచ్చింది. భోజనాలు చేస్తుండగా రఘు అడిగాడు "దివ్యా! బిటెక్ తరువాత ఏం చేద్దామని అనుకుంటున్నావు? నువ్వు ఏ ప్రయత్నమూ చేయటం లేదు. నీ ప్లాన్ ఏమిటి? సంబంధాలు చూడమంటావా? ఏదైనా నేను సిద్ధంగా వున్నాను" అన్నాడు.

"నాన్నా! నేను చదువుకుంటాను. అయితే భారతదేశం సంస్కృతి మూలాలు తెలుసుకోవాలని అనుకుంటున్నాను.

మన గురించి, మన సంస్కృతి, సంప్రదాయాలు గురించి, ప్రాంతీయ భాషా శాస్త్రాలను సమూలంగా తెలుసుకోవాలనుకుంటున్నాను. అయితే బిటెక్‌లో చదివిన ఆంగ్ల భాషకు తప్ప మరొక భాష చదివే అవకాశం లేదు. ఏదైనా విశ్వవిద్యాలయం విద్యార్థిగా వుంటే తప్ప గ్రంథాలయ ప్రవేశం లభించదు. ముందు ఆంగ్లభాషలో ఎం.ఏ. చేస్తే, ఆ తరువాత మరొక భాషలో ఎం.ఏ. చేసుకోవచ్చు. నేను పీ.జి.లో చేరి వంద సంవత్సరాల చరిత్రగల

"అదేం లేదు నాన్నా! మన జీవితం, మన చదువు, మన కృషి, మన అభిరుచి ఎలా వుంటే అలా జరగాలి. ఎవరికోసమోనని నచ్చనివి చేయలేం కదా!" అంది దివ్య.

"అయితే మా అమ్మాయి ఎం.ఎస్. చేయదని మూర్తి గారికి ఫోన్ చేస్తాను" అన్నాడు రఘురామ్.

విశ్వకళాపరిషత్‌లో చేరి చదువుకుంటాను" అంది దివ్య.

"అలాగే తల్లీ! అయితే కూతురు మెరిట్‌లో ముందు వరుసలో వుంటే చదువు చెప్పించలేదు" అని ఎవరూ నన్ను విమర్శించకూడదు మరి.

"అదేం లేదు నాన్నా! మన జీవితం, మన చదువు, మన కృషి, మన అభిరుచి ఎలా వుంటే అలా జరగాలి. ఎవరికోసమోనని నచ్చనివి చేయలేం కదా!" అంది దివ్య.

"అయితే మా అమ్మాయి ఎం.ఎస్. చేయదని మూర్తిగారికి ఫోన్ చేస్తాను" అన్నాడు రఘురామ్.

అనుకున్నట్లుగానే రెండు సంవత్సరాలలో మంచి విషయ పరిజ్ఞానంతో పాటు పి.జి. డిగ్రీ కూడా సంపాదించుకుంది దివ్య.

క్షణము కొనలేము కోట్లను పణంగా పెట్టి
జాగు చేసిన ఫలితము బాగుకాదు
సమయస్ఫూర్తికి మించిన సత్తువేది
వేగముగా సాగుము పడకుండ దేగ కళ్ళు

ఎవరో కవి అన్నట్లు గుర్తుకొచ్చి సుహాసిని కూతుర్ని చూసి మురిసిపోతూంటుంది. సలక్షణాలతో కావలసినట్లు తీర్చిదిద్దుకున్న తన బిడ్డ ఎవరింటి కోడలిగా అడుగు పెడుతుందో.. మధ్య తరగతి మాతృమూర్తికుండే సామాన్యమైన సందేహమే. ఆ కళ్యాణ ఘడియ ఎపుడో! అని మనసులో అనుకుంది. ఆ..! ఇంకా వయసెంతని!? 23 నడుస్తోంది. అంతేకదా! అయినా ఇప్పటి నుండి ప్రయత్నిస్తే ఎప్పటికో కుదురుతుంది. భర్తకి ఓసారి గుర్తు చేయాలి..ఈ విషయంలో అనుకుంది.

పిహెచ్.డి.కి అన్ని విశ్వవిద్యాలయాలకి దరఖాస్తు చేసుకుంది. భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై ఒక విశిష్ట అధ్యయనం చేసి తెలుసుకోవాలని ఆరాటపడుతోంది దివ్య.

అదే సమయంలో తెల్సినవారెవరో "మంచి సంబంధం వుంది, మీకు నచ్చితే వివరాలు చూసుకోమని" వివరాలు పంపించారు.

కేంద్ర సమాచార సంస్థలో ఇన్ఫర్మేషన్ ఆఫీసరుగా పని చేస్తున్నాడు వరుడు. తండ్రి రక్షణ శాఖలో పని చేసి విశ్రాంతి తీసుకుంటున్నాడు. కుటుంబం స్వగ్రామంలో వుంటున్నారు. వరుడు ఢిల్లీలో పని చేస్తున్నాడు. బదిలీలు జరుగుతుంటాయి. వారికి కావలసినవి అమ్మాయికి చదువు, చురుకుదనం వుండి, సమాజం, దేశం, ఆర్థిక వ్యవస్థ వంటి వాటిపై అవగాహన వుండాలి. సహకరించే గుణం, ఓర్పు వుండాలి. కట్నాలు, కానుకలు తేవక్కరలేదు. పై లక్షణాలు వుండి పాతికేళ్ళలోపు వయస్సు అమ్మాయి కావాలి.

రఘురామ్ వాళ్ళ నక్షత్రం, వివరాలు చూసి సంతృప్తిగా అనిపించి, సమయం చూసి తల్లీ కూతుళ్ళిద్దరికీ ఒకేసారి వివరాలు చేరవేస్తారు. ఆ సమయంలో వారి సంభాషణ సెల్‌ఫోన్‌లో రికార్డు చేసారు రఘురామ్, దివ్య ఏం చెబుతుందో మళ్ళీ మళ్ళీ వినవచ్చని.

"నాన్నా, నాకు జీవితంలో మంచి అమ్మా నాన్నలని ఇచ్చిన భగవంతుడు నా జీవితాన్ని కూడా ఆయనే నిర్ణయిస్తాడు. మీకు ఏది మంచిదనిపిస్తే అదే చేయండి. అయితే లేడీ లెజండ్‌లాగ, చరిత్రలో నిలిచిపోయే వీరవనితలాగ కాకపోయినా చిన్న చిన్న ఆశయాలు వున్నాయి. జాబ్ చేయాలనే సరదాలేదు కానీ అవసరం అయితే చేస్తాను. అధ్యయనం పూర్తి చేసి డాక్టరేట్ పొందాలి. నా పరిధిలో చేయగలిగిన చిన్న చిన్న సహాయ కార్యక్రమాలు చేసి చైతన్యం కలిగించే సమాజ శ్రేయస్సు చేపట్టాలని వుంది. అనాథాశ్రమాలలో వున్న పిల్లలకు ఏ పండుగ రోజో ఐస్‌క్రీములు పంచాలనుకుంటే ఓ పదివేలు ఖర్చు పెట్టగలిగిన ఆర్థిక స్వాతంత్ర్యం వుండాలి. నా అభిప్రాయాన్ని కొట్టిపారేసే భర్త కాకూడదు.

అయినవాళ్ళని చూడాలనుకుంటే అవసరమైనప్పుడు వెంటనే విమానం టికెట్ కొనుక్కునే స్థోమత వుండాలి. మంచి ఆత్మీయత పంచటానికి, నా పాత్ర నేను సక్రమంగా పోషించటానికి నేను ఎప్పటికీ సిద్ధమే. విదేశాలకు పర్యటనకు వెళ్లటానికి కూడా నేను సిద్ధమే. కానీ అక్కడ స్థిరపడటానికి ఇష్టం లేదు. ఇవే నేను కావాలనుకుంటున్నవి. మీకు ఏది నచ్చితే అది నాకు సమ్మతమే. సామాజిక బాధ్యతను కొంచెమైనా తీసుకోవాలనుకుంటున్నాను. ఇది కచ్చితం.

మౌనంగా కూర్చున్న సుహాసిని తన కూతురు ఎంత ఎదిగిపోయిందో, ఎన్ని ప్రణాళికలు వేసుకుందో! అమ్మో!! నాకంటే మానసికంగా ఉన్నతంగా వుంది.. అనుకుంది. కూతుర్ని మౌనంగా ఆశీర్వదించింది.

తండ్రి రఘురామ్ ఆమె మాటలు వింటూ దీర్ఘంగా ఆలోచనలో పడ్డాడు. ఎవరైనా వరుడు తెల్లగా వుండాలి, పొడుగ్గా వుండాలి, పెద్ద ఉద్యోగంలో వుండాలి అని కోరుకునే అమ్మాయిలను చూస్తుంటాం.

దివ్య చెప్పినవన్నీ కాలాన్ననుసరించి, అవకాశాన్ని బట్టి బయట పడుతుంటాయి. ఈ లక్షణాలు కలిగి వుండాలని ఎవరికీ చెప్పలేం కదా!

కాలగమనంలో పది రోజులు గడిచాక ఈ సంబంధం విషయం తెరపైకి వచ్చింది. చిన్న కుటుంబం చింత లేని కుటుంబం రఘురామ్‌ది. ఆఫీసుకి వెళ్లిపోతే ఇల్లూ, ఇంటి విషయాలు ఏమీ అంతరాయం కాకూడదు అని అనుకుంటాడు.

సి.ఎ. చేసి సొంతంగా ప్రాక్టీసు చేస్తున్నాడు. మంచి కూడలిలో ఆఫీసు. క్రమశిక్షణ, నిజాయితీగా వుంటూ ఆడిటర్‌గా చేస్తున్నాడు. "ఆఫీసుకు ఎవరో వచ్చారు, పర్సనల్‌గా మిమ్మల్ని కలవాలని" ఇంటర్‌కమ్‌లో ఫోను చేసి క్లర్కు చెప్పాడు.

లోపలికి వచ్చినాయన ఎవరో మూర్తీభవించిన ఆధ్యాత్మికవేత్తలా వున్నాడు.

చక్కటి సంస్కారం.. వేషధారణలో, మాటలో వినయం. "అయ్యా, నమస్కారం! నా పేరు సదాశివరావు" అన్నాడు.

"నమస్కారం! రండి.. కూర్చోండి" అన్నాడు రఘురామ్.

"మీ బంధువు రామచందుగారు నాకు స్నేహితులు. లోక కళ్యాణార్థం ఏదో చిన్న చిన్న ప్రయత్నాలు చేస్తుంటాను. కండక్టర్‌గా పని చేసి రిటైర్ అయ్యాను. పెళ్లికొడుకు వివరాలు పంపించింది నేనే. మీరు అమ్మాయి అభిప్రాయం ఆడియో రూపంలో పంపించి మంచి పని చేసారు. మగపెళ్లివారు నాకు బాగా పరిచయం. వారికి మీ పూర్తి వివరాలు తెలియజేసాను" అని చెప్పారు సదరు మధ్యవర్తి సదాశివరావు. ఆ వివరాలు చూస్తే మీ అమ్మాయి దివ్య శ్రీదేవిని సిరిదేవి అంటే బాగుంటుందని అనిపించింది. మీకు అనుకోకుండా 14 ఎకరాలు ఆస్తి కలిసొచ్చిందని, పుట్టుకతోనే కుటుంబానికి విజయం తీసుకొచ్చిందని, విద్య, వినయం ఆమె సొంతమని మీరు చెప్పిన విషయాలు, ఆమె అభిమతం, ఆశయాలు అన్నీ నేను వరుని తండ్రికి తెలియచేసాను. వారు కూడా మీ పద్ధతినే గౌరవిస్తూ ఈ మాటలు పంపించారు.

"ఈ ఆడియోలో తండ్రి, కొడుకుల మధ్యలో జరిగిన సంభాషణ వుంది. మీరు వినండి" అని ఆడియో వినిపించాడు. అందులో–

"నాన్నగారూ! నేను చేస్తున్న నిఘా విభాగంలో ప్రభుత్వ కార్యలాపాలు నిర్వహించడంలో ఉద్యోగాన్ని మాత్రమే చేయకూడదు. దానికి నిబద్ధత, నిజాయితీ కూడా ఉండాలి. నేను వ్యక్తిగతంగానే కాదు, నాకు కుటుంబ సహకారం వుండాలి. ఎటువంటి ఒత్తిడులకు లోను కాకుండా, నాతో సహా అందరూ దేశాన్ని గౌరవించాలి.

భార్య స్థానంలో ఉన్న వ్యక్తి నుండి పూర్తి సహకారం కావాలి. మీ నుంచి నేను నేర్చుకున్న అంకితభావం అందరికీ వుండాలి కదా! మంచి సలహాలు చెప్పే నేర్పు, ఓర్పు కూడా అవసరమే. నేను ఆఫీసులో కూర్చుని దేశానికి సేవలందిస్తున్నాను. భౌతికంగా సేవలందిస్తున్న నా సోదర సైనికుల మరణించినవారి కుటుంబానికి, వారి సంక్షేమానికి నా నెల జీతంలో పది శాతం అందజేస్తున్నాను.

బాధ్యతతో పాటు, ఆవేదన, ఒత్తిడి నా వృత్తిలో ఎక్కువే. ఇంటికి వచ్చి ప్రశాంతంగా కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడపగలిగేలా వుండాలి. భార్యంటే బాధ్యత, బాధ, భాగ్యం, బరువు, భోగం, భాగం పంచుకునే పడతి అయి వుండాలి. గుండెల్లో గుదిబండ కాకూడదు. అలాంటి భార్యను కోరుకుంటున్నాను. మీకు అర్థమయిందనుకుంటాను నాన్నా!" అంటూ ముగించాడు.

అయితే ఈ మాటలు పదిలపరచి వధువు తండ్రికి పంపబడతాయని వరునికి తెలియదు.

వరుడు కేంద్ర ప్రభుత్వ నిఘా విభాగంలో కీలక స్థానంలో వున్న హోదాగల అధికారి. అతని పేరు అరవింద మనోహర్! ఎత్తు ఆరు అడుగులు. రంగు సుమారుగా వుంటాడు. గతంలో జాతీయ స్థాయిలో క్రీడలలో పాల్గొన్న క్రీడాకారుడు. ఆ విషయం వారి ఇంటికి వెళ్లినప్పుడు చూసిన పతకాలు, మెమొంటోలు తెలియజేస్తున్నాయి. ఇద్దరే పిల్లలు. అమ్మాయికి వివాహం చేశారు. ఇతనికి వివాహం కావలసి వుంది. ఉండటానికి ఇల్లు, బతకటానికి పెన్షన్. మంచి వ్యక్తిత్వం కలిగిన, వెలకట్టలేని కుమార రత్నమే వారికి ఆస్తి. అబ్బాయి ఉద్యోగం భారతదేశ రాజధానిలో. ఇక మీ నిర్ణయం కూడా బాగా ఆలోచించి చెబితే నేను వారికి తెలియచేస్తాను" అన్నారు సదాశివరావుగారు.

ఆడియోలోని స్థిరమైన, గంభీరమైన భావ వ్యక్తీకరణ చూస్తే అబ్బాయి మంచి వ్యక్తిత్వం కలవాడని తెలుస్తోంది.

"ఇంట్లో చెప్పి ఏ విషయం మీకు తెలియచేస్తాను" అని సదాశివరావు గారితో మాట్లాడుతూ వారికి కాఫీ తెప్పించి తను కూడా తాగుతూ కులాసా కబుర్లు పంచుకున్నాడు రఘురామ్.

సదాశివరావుగారు వెళ్లిపోయాక ఈ విషయం పైనే దృష్టి పెట్టి, భార్య సుహాసినితో చర్చించి, దివ్యని అడిగి అభిప్రాయం తెలుసుకోవాలని నిర్ణయించుకున్నాడు.

పరస్పర అవగాహన కుదిరిన తరువాత, మంచి శుభ ఘడియలలో అరవింద్‌కి, దివ్యకి ఘనంగా వివాహం జరిగింది.

వినయం, విధేయత, విద్య, ఉద్యోగం.. అన్నీ కలబోసిన రూపం, స్ఫురద్రూపి అరవింద్ నిజంగా మనోహరుడే. చూసిన వారందరూ ఇదే అన్నారు. తగిన జోడీ. దివ్య పేరుకు తగినట్లుగానే చక్కని రూపం, సహజంగా సంస్కారయుతమైన పెంపకంలో భువికి దిగి వచ్చిన శ్రీదేవిలాగ వుంది.

దేశానికి వన్నె తెచ్చే బాధ్యతగల పౌరునిగా అరవింద్, సహధర్మచారిణిగా దివ్య నూతన జీవితం ఢిల్లీలో ప్రారంభమైంది.

భారతదేశం గర్వించదగిన అంశాలు దేశ సంస్కృతి, సంస్కృత భాష. ఈ రెండూ అన్య దేశాల నుంచి ప్రశంసించబడే విశేషాలు... అనే అంశంపై దివ్య నిరంతరం అధ్యయనం చేస్తోంది.

ఉద్యోగ నిర్వహణలో భాగంగా దైనందిన జీవిత గమనం శరవేగంగా సాగుతోంది. మూడు సంవత్సరాలకి దివ్య పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథం విశ్వవిద్యాలయానికి సమర్పించింది.



జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ద్వారా కాన్వొకేషన్‌లో డాక్టరేట్ అందుకున్న దివ్యశ్రీదేవి ఫోటో మనోహర్ తన కెమెరాలో బంధించాడు.

నేటి యువతే రేపటి భారత భవితవ్యం.

భారతదేశంలోని యువత అందరూ ఇలా వుంటే సుసంహత భారం కాగలదు కదా! అనుకున్న గమ్యం చేరుకోవటంలో సరైన లక్ష్యం కలిగి వుండటమే దేశ ప్రగతికి బాట. వందే భారతమాతరం.

డాక్టర్ దివ్య శ్రీదేవి మనోహర్ కాన్వొకేషన్ విశేషాలను తల్లిదండ్రులకు తెలియజేసింది సంతోషంగా. జన్మ సార్థకత సమాజంలో ఒకరిగా కాకుండా సమాజానికి మనమొకరిగా దివ్య దంపతులు నిరూపించారు.

చమత్కార శ్లోకాలు

యామిజాల జగదీశ్

మనం మన మాతృభాషనే సరిగ్గా మాట్లాడలేని దుస్థితిలో ఉన్నాం. ఇక సంస్కృతందాకా ఎందుకు? ఎవరేమోకానీ నా విషయానికి వస్తాను. మా నాన్నగారు పండితులే.. అటు సంస్కృతంలోనూ, ఇటు తెలుగులోనూ. అంటే వేరేగా ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. నేను పుట్టి పెరిగింది చెన్నైలో. ఆ ప్రభావమో ఏమో కానీ తమిళం మీదున్న ప్రేమను మాతృభాష మీద అంతగా చూపెట్టలేకపోయాను.

మా నాన్నగారు కూర్చోపెట్టి తెలుగులో పద్యాలు రాయిస్తానని, సంస్కృతం నేర్పిస్తానని చెప్పినా ఆసక్తి చూపలేకపోయాను. కానీ అప్పుడేమోగానీ ఇప్పుడు అనిపిస్తోంది నేను ఎంత కోల్పోయానో అని.

ఉద్యోగరీత్యా కావచ్చు లేదా మరో కారణం కావచ్చు. ఇప్పుడుంటున్నది హైదరాబాదులోనే. నాకు పాత పుస్తకాలు కొనడం ఎంతో ఇష్టం. అలాగే పాత పుస్తకాలు తిరగేయడం సరదా.

అలాగే ఓసారి చాలా కాలం తర్వాత ఓ ఆదివారం ఆబిడ్స్ వెళ్లాను పాత పుస్తకాలు చూద్దామని. ఓ రెండు మూడు పుస్తకాలు తీసుకున్నాను. వాటిలో ఒకటి సంస్కృతంలోని చమత్కార శ్లోకాలకు తెలుగులో తాత్పర్యం చెప్పిన పుస్తకమొకటి. అది తిరగేస్తుంటే నేను సంస్కృతం నేర్చుకోవడంలోని తప్పును తెలుసుకుని బాధపడుతున్నాను. అంతర్జాతీయ భాష ఇంగ్లీషు తెలుసుకోవడం, మాట్లాడడం అవసరమే. అలాగని మన మాతృభాషను మరిస్తే ఎలా.. ఈ మధ్య ఒకరికి ఓ లేఖ రాస్తే గోడకు కొట్టిన బంతిలా వారి నుంచి ప్రశ్నల వర్షం.. ప్రశంస, కొనియాడడం...

ఇత్యాది కొన్ని పదాలు రాస్తూ వాటి అర్థాలు చెప్పమని. ఏం చెప్పను? వారికి ఓ నమస్కారం పెట్టి ఊరుకున్నాను.

సరే.. అది పక్కనపెట్టి ప్రస్తుతం చదువుతున్న సంస్కృత శ్లోకాల పుస్తక విషయానికి వస్తాను.

అందులో ఒకటి రెండు ఇక్కడ ప్రస్తావిస్తాను . మొదటి శ్లోకంలో వినాయకుడి చిలిపితనం.

యుగపత్ స్వగండ చుంబన లోలౌ పితరౌ నిరీక్ష్య హేరంబ ।

తన్ముఖ మేళన కుతుకీ స్వా నన పపనీయ పరిహాసన్ పాయాత్ ॥

ఓసారి పార్వతీ పరమేశ్వరులు తమ ముద్దుల బిడ్డడు వినాయకుడికి ఏక కాలంలో అతని చెక్కిళ్లపై ముద్దు ఇవ్వాలని అనుకుంటారు.

ఈ విషయం గ్రహిస్తాడు వినాయకుడు. అయితే అమ్మా నాన్నలు ముద్దుపెట్టుకునేలా చేయాలని అనుకుంటాడు వినాయకుడు. తన తల్లిదండ్రులు తనకు ముద్దు పెట్టడానికి దగ్గరకు వస్తుంటే వినాయకుడు అదే తగిన సమయం అనుకుని తన ముఖాన్ని వెనక్కు తీసుకుంటాడు.

అప్పుడు శివపార్వతుల ముఖాలు దగ్గరై పెదవులు కలిసి ముద్దుపెట్టుకోవడం జరుగుతుంది. ఆ దృశ్యం చూసి ఓ చిలిపినవ్వు నవ్వుతాడు. అటువంటి వినాయకుడు మిమ్మల్నందరినీ రక్షించాలని ఆ కవి తన చమత్కార శ్లోకంలో చెప్తాడు.

ఎంత అందమైన ఊహో కదండీ.

మరొక శ్లోకంలో పార్వతీ పరమేశ్వరుల మధ్య సాగిన సరస సంభాషణను చూద్దాం.

త్వ తిష్టతస్తే పితరౌ మమే వే
త్వపర్ణ యోక్తే పరిహాస పూర్వమ్
క్వ వా మమేవ శ్వశురౌ తనే తి
తా మీరయన్ సస్మిత మీశ్వరో వ్యాత్

ఓసారి పార్వతి శివుడిని సరదాగా పరిహసించాలని అనుకుంటుంది.

“స్వామీ, నాకు తల్లిదండ్రులున్నారు. వాళ్లు నాకన్నటికీ అండగా ఉంటున్నారు. మీకు తల్లిదండ్రులు లేరు, మీరు ఎవరూ లేని అనాథ కదా” అని పార్వతి అంటుంది.

శివుడు పరమాత్మ. కనుక జననం లేదు. తల్లిదండ్రులు లేరు. పార్వతి మాటలు విని శివుడు “ఓసీ పిచ్చిదానా, నాకు అత్తమామలున్నారే, వాళ్లే అన్ని విధాలుగా నాకు సహాయం చేస్తున్నారుగా, నాకు అండగా ఉంటున్నారు కూడా. అంతెందుకు, నా బంధువుల బలగం కూడా చాలా పెద్దది. పైగా నీకు అత్తమామలేరీ? అంటాడు. ఇంట్లో ఏదైనా కష్టం జరిగితే నీకు పెద్ద దిక్కుంటూ చెప్పుకోవడానికి ఎవరూ లేరు. కనుక నువ్వు అనాథవు” అని శివుడు చెప్పాడు.

దాంతో శివుడి ప్రతి పరిహాసానికి ఏం చెప్పాలో తెలియక పార్వతి మరో మాట మాట్లాడకుండా ఊరుకుంది.

ఇక కృష్ణ పద మాధుర్యాన్ని చూద్దాం.

మృద్వీ కా రసితా పిసా సమసితా స్ఫీకం నిపీతం పయః

స్వర్లో కేపి సుధా పృధాయి కతిథా రంభాధరః ఖండితః

సత్యం బ్రూహి మదీయ చిత్త భవతా భూయః పరిభ్రామ్యతా

కృష్ణే త్యక్షరయో రయం మధురిమోద్గారః క్వచిల్లక్షితః

ఓ కవి ఈ విధంగా తన మనసుని ప్రశ్నించుకున్నాడని ఈ శ్లోకం చెప్తోంది.

ఓ మనసా, నువ్వు తృప్తిగా పాలు తాగావు, బాగానే ఉంది. పొట్ట నిండా ద్రాక్ష తిన్నావు. మధురంగా ఉందని చక్కెర తిన్నావు. స్వర్గంలోని అమృతాన్ని కూడా రుచి చూశావు. ఎన్నో సార్లు దేవ వేశ్య అయిన రంభ మధురమైన అధరాన్ని ఆస్వాదించావు. ఇంకా ఎక్కడెక్కడో ఎన్నెన్నో విషయాల్లో సంచరిస్తుంటావు. అపారమైన అనుభవాన్ని సంపాదిరావు.

తద్వారా జ్ఞానాన్ని సంపాదించావు. ఇదంతా బాగానే ఉంది. కానీ నీ లోక భ్రమణ యాత్రలో కృష్ణ నామస్మరణ మాధుర్యాన్ని ఎప్పుడైనా చవిచూశావా, ఆ అనుభవమెక్కడైనా నీకు కలిగిందా? రాలేదు కదూ!

భగవన్నామస్మరణ మధురమైనది. ఆ ఆనందం ఊహాకందనిది కదా అని అనుకుంటాడు. నిజమేగా! ఎక్కడెక్కడ సంచరించి ఎంతెంత తెలుసుకుంటేనేం.. కృష్ణుడనే మాట ఉచ్చారణలో పొందే ఆనందానికి సాటేది!

....

తెలుగులో తిట్టు కవిత్వంలో ఆదికవి భీమకవి.

అసలు కవితా రచనకు ఆవేశం అవశ్యం. అందులో తిట్టు కవిత్వమనేదాని గురించి వేరేగా చెప్పక్కర్లేదు. తిట్టు కవిత్వానికైతే మరింత ఆవేశం తప్పనిసరి. ప్రతి కవి ప్రారంభ దశలో ఆవేశంగానే మొదలు పెడతాడు. అది సహజం. ఇందుకు సంస్కృత భాషలో ఆదికవి వాల్మీకి మహాముని వాక్కు నుండి వెడలిన మానిషాదేవి శ్లోకమే చక్కని తార్కాణం. మన తెలుగు కవుల విషయానికి వస్తే భీమనాథుడు ఇందుకు ఉదాహరణ. భీమనను తెలుగు తిట్టు కవిత్వ విభాగం వరకూ ఆదికవిగా చెప్పుకోవచ్చు.

భీమనతో పాటు శ్రీనాథుడు, తెనాలి రామలింగకవి, ఆడిదము సూరకవి తదితరులు ప్రారంభంలో రాసిన కవితలు తిట్టుకవిత్వమే.

తర్వాతి తరంలో తిరుపతి వేంకటకవులు కూడా తిట్టుకవితలు రాసినవారే.

వేములవాడ భీమకవి పన్నెండో శతాబ్దానికి చెందిన కవి. తెలుగు కవులలో తిట్టు కవిత చెప్పిన వారిలో దిట్ట. కూచిమంచి జగ్గకవి అనే ఆయన తమ చంద్రరేఖా విలాపములో మొట్టమొదటగా భీమకవినే పేర్కొన్నారు. చంద్రరేఖా విలాపము తిట్టు కావ్యమే.

నన్నయ్యకవి తెలుగులో పద్య విద్యలో ఆదికవి అయితే భీమన తిట్టు కవితలల్లడంలో ఆదికవిగా వినుతికెక్కారు. భీమకవి తమ కవిత్వ రచనలో నిగ్రహానుగ్రహశక్తి చూపడం విశేషం. అందువల్లే భీమకవి సార్థక నామధేయుడిగా వినుతికెక్కారు.

భీమకవిని బాల్యంలో కొందరు ఒరోజు అవహేళన చేసారు. ఆయన ఓ విధవ కొడుకని తోటి బాలురు నిందాహేళనగా చెప్పగా తల్లి వద్దకు వెళ్లి భీమన తన తండ్రి ఎక్కడని? అడిగారు. అప్పుడు ఆమె "భీమేశ్వర స్వామే నీ తండ్రి" అని చెప్పింది. అనంతరం ఆయన ఆ దేవుడి సన్నిధికి వెళ్లి ఆ స్వామి అనుగ్రహం పొందినట్టు చరిత్రపుటలు చెబుతున్నాయి.

కరీంనగర్ జిల్లా వేములవాడలో ఓ ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి వెళ్లినప్పుడు ఆయన తీవ్ర స్థాయిలో మాటలు పడాల్సి వచ్చింది. అక్కడ పెద్ద భీమకవిని అవమానించి పంపించేశారు. అయితే భీమకవి ఆ ఇంటి వాకిట ఉండి మూసేసిన తలుపు సందులోంచి చూసి అక్కడి భోజన పదార్థాలపై ఓ పద్యం చెప్పారు.

గొప్పలు చెప్పుకొంచు నను గూటికి బంక్తికి రాకు మంచు నీ

త్రిప్పుడు బాప లందఱును గట్టిరి కావున నొక్కమాఱు నీ

యప్పములన్ని కప్పలయి యన్నము సున్నముగాగ మాఱుచున్

బప్పును శాకముల్ పులుసు పచ్చడులు జిఱుఱాలు గావుతన్

అని అక్కడి పదార్థాలపై తమ కోపమంతా చూపారు.

ఆయన మాట వృధా పోదుగా.

అతనన్నట్లే విస్తళ్లలో వున్న అప్పాలు కప్పలై ఎగిరాయి. అన్నం సున్నమైంది. కూరలు తదితరాలు చిన్న చిన్న రాళ్లుగా మారిపోయాయి. తినడానికి వచ్చిన బ్రాహ్మణులు ఆశ్చర్యపోయారు.

ఇంటి యజమాని, ఆ బ్రాహ్మణులు దీనికంతటికి కారణం భీమకవే అని తెలుసుకున్నారు. అయితే అవన్నీ తిరిగి యథాస్థితికి రావడం కోసం ఆయన–

ఘనుడీ వేములవాడ వంశజుడు దాక్షారామ

భీమేశనం.. అంటూ ఓ పద్యం చెప్పారు.

రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. sunmagvaartha@gmail.com

ఆంధ్రజాతి ఖ్యాతిని భారతదేశ నలుచెరుగులా వ్యాపింపచేసి చరిత్రలో శాశ్వత స్థానాన్ని పొందిన పాలకులలో కాకతీయ ప్రతాపరుద్రుడు ఒకరు.

రాణీ రుద్రమదేవి మనుమడైన ప్రతాపరుద్రుడు మూడున్నర దశాబ్దాల పాటు ఓరుగల్లు (వరంగల్) రాజధానిగా చేసుకొని తెలుగువారి కీర్తి బావుటాను ఎగురవేశారు. ఢిల్లీ నవాబు తుగ్లక్ సేనల చేతిలో ఓటమిపాలై శత్రువులకు బందీగా చిక్కి అవమానభారం తట్టుకోలేక నర్మదా తీరంలో ఆత్మహత్య చేసుకొన్నారని శాసనాలు, చరిత్రకారుల వల్ల తెలుస్తోంది.

ఇలపావులూరి వెంకటేశ్వర్లు

కోటలకు కోట కొండవీటి కోట

ప్రతాపరుద్రుని తరువాత కాకతీయ సామ్రాజ్యం పూర్తిగా పతనమైపోయింది. ఆ తరువాత కొంత కాలం ఆంధ్రజాతి సరైన పాలకులు లేక యుద్ధాలతో అల్లకల్లోలంగా మారిపోయింది అని చరిత్ర చెబుతున్న విషయం.

ఆ సమయంలో ముసునూరి నాయక, రాచర్ల నాయక వంశాలు నేటి తెలంగాణాలో మొగ్గ తొడిగాయి. కాకతీయ పాలకుల వద్ద సేనాపతులుగా ఎన్నో యుద్ధాలలో పాల్గొన్న రెడ్డి వంశంవారు ఆంధ్ర ప్రాంతానికి వచ్చి నేటి ప్రకాశం జిల్లాలోని అద్దంకిని రాజధానిగా చేసుకొని రెడ్డి రాజుల సామ్రాజ్యానికి పునాది వేశారు.

మహామండలేశ్వరునిగా పిలవబడిన ప్రతాపరుద్రుని డెబ్బై ఏడు మంది నాయకులలో ప్రముఖులు ముసునూరి వంశ పాలనకు మూలమైన కాయప నాయకుడు, రెడ్డి రాజ్య స్థాపకుడైన ప్రోలయ వేమారెడ్డి.

ముసునూరివారు, రాచర్లవారు కొద్ది కాలమే పాలన చేయగలిగారు. రెడ్డి రాజులు మాత్రం సుమారు శతాబ్ద కాలానికి పైగానే తమ ప్రభావాన్ని ఆంధ్ర ప్రాంతాలలో కాకుండా తమిళ, ఒఢ్ర దేశాల పైన కూడా చూపించారు అని శాసనాధారాలు తెలుపుతున్నాయి.

తొలుత అద్దంకిని రాజధానిగా చేసుకొన్నా రాజకీయంగా అది సరైన ప్రాంతం కాదని తగిన అనువైన ప్రదేశం కోసం అన్వేషించి, చివరకు చుట్టూ పర్వతాలతో వున్న



సురక్షితమైన కొండవీటి ప్రాంతాన్ని ఎంచుకొన్నారు. పటిష్టమైన కోటను నిర్మించుకున్నారు. వారి అంచనా తప్పలేదు. ఆనతి కాలంలోనే కొండవీడు శత్రుదుర్భేధ్యం అన్న పేరు పొందింది. రెడ్డి రాజ్య స్థాపకుడు ప్రోలయ వేమారెడ్డి తప్ప మిగిలినవారు అంతా ఈ కోట నుండే పాలన సాగించారు. తొమ్మిది మంది రెడ్డి రాజులలో ఎనిమిది మంది కొండవీడును తమ రాజధానిగా చేసుకొని కంచి నుంచి కటకం వరకు సువిశాల ప్రాంతాన్ని పరిపాలించారు. ప్రోలయ వేమారెడ్డి కుమారుడు అయిన అనవోతారెడ్డి కాలంలో కొండవీటి కోట నిర్మాణం పూర్తి అయ్యి రాజధాని అద్దంకి నుండి కొండవీడుకు మార్చబడింది.

వీరిలో ప్రముఖుడు అనవేమారెడ్డి. ప్రోలయ వేమారెడ్డి కనిష్ట పుత్రుడు. అనవోతారెడ్డి గొప్ప యోధుడు. కవి, పండితుడు. ప్రజారంజకంగా పాలన సాగించిన ప్రభువు. వీరిలో చివరి పాలకుడు వీరభద్రారెడ్డి. ఈయనతో రెడ్డిరాజ్యం కనుమరుగైంది.

రెడ్డి రాజులు-ప్రముఖ కవులు

రెడ్డి రాజులు అందరూ స్వతహాగా కవులు, రచయితలు. కొన్ని కావ్యాలను కూడా రచించారని తెలుస్తోంది. వీరు కవి పండితుల పట్ల అమిత గౌరవ మర్యాదలు కలిగి ఉన్నారు.

ప్రోలయ వేమారెడ్డి అద్దంకిలో రాజధాని స్థాపించిన నాటినుండి సమీపంలోని చదలవాడ గ్రామానికి చెందిన ఎఱ్ఱాప్రగడ(ఎఱ్ఱన) ఆస్థాన కవి.

వ్యాస భగవానుడు చెబుతుండగా విఘ్నేశ్వరుడు లిఖించిన మహా కావ్యం మహాభారతం. సంస్కృతంలో ఉన్న ఆ కావ్యాన్ని తెలుగు భాషలోకి అనువదించి అందరికి అందుబాటులోకి తేవాలన్న సత్సంకల్పంతో ఆదికవి నన్నయామాత్యుడు రాజమహేంద్రవరాన్ని పాలించిన వేంగి రాజైన శ్రీ రాజరాజ నరేంద్రుని ప్రోత్సాహంతో రచన ఆరంభించారు. అరణ్య పర్వం సగం వరకు పూర్తి చేయగలిగారు.

ఆ భాగాన్ని వదిలేసి మిగిలిన కావ్యాన్ని తిక్కన మహాకవి పూర్తి చేశారు. కానీ ఎందుకనో అరణ్య పర్వాన్ని పూర్తి చేయలేదు.

ప్రోలయ వేమారెడ్డి కోరిక మేరకు ఎఱ్ఱన అరణ్య పర్వంలోని శేష భాగాన్ని రచించారు. మరొక మహాకవి కూడా రెడ్డి రాజుల కాలంలోనే కాదు భావితరాలవారు కూడా కీర్తించే ఖ్యాతిని గడించారు. ఆయనే కవి సార్వభౌమ శ్రీనాథుడు. శ్రీనాథుడు రెడ్డిరాజులలో మరో గొప్ప పాలకుడైన పెదకోమటి వేమారెడ్డి ఆస్థాన కవిగా ఉన్నారు.

రాజాస్థానంలో ఉన్నప్పుడు శ్రీనాథుడు ఎన్నో గొప్ప కావ్యాలను రచించారు. పండితారాధ్య చరిత్ర, శివరాత్రి మహాత్యం, హరవిలాసం, కాశీఖండం, శృంగార నైషధం, పలనాటి వీర చరిత్ర.. ఇలా ఎన్నో కావ్యాలను రచించారు. మహాకవి బమ్మెర పోతన కూడా రెడ్డి రాజుల కాలానికి చెందినవారు. గొప్ప రామభక్తుడు.

పోతన శ్రీమద్భాగవతాన్ని తెలుగులో రచించారు. అలా రెడ్డిరాజులు కవి పండితుల పట్ల ఎంతో గౌరవ మర్యాదలు చూపించారని, తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని తోడ్పాటు అందించారని తెలుస్తోంది. మానవ నైజాన్ని, సమాజ పోకడల గురించి, నాడు అనుసరిస్తున్న కుల వ్యత్యాసాన్ని లలిత లలిత పదాలలో పామరులు కూడా అర్థం చేసుకోగల భాషలో గొప్పగా వేమన శతకం పలికిన యోగి వేమన, రెడ్డిరాజుల వంశానికి చెందినవారన్న ఒక కథ ప్రచారంలో ఉంది. అనవేమారెడ్డి తమ్ముడు యోగి వేమన అని అంటారు.

రెడ్డి రాజులు-ఆలయాలు

రెడ్డి రాజులు శైవమతాభిమానులు. హిందూధర్మం పట్ల గౌరవం కలిగినవారు. వీరి కులదైవం శ్రీ మూలాంకులేశ్వరి అమ్మవారి ఆలయాన్ని కొండవీడుకు సమీపంలోని అమీనాబాదు గ్రామంలో నేటికీ సందర్శించుకోవచ్చు.

అమరావతి, శ్రీశైలం, శ్రీ అహోబిల నారసింహ ఆలయాలను పునర్నిర్మించారని అక్కడి శాసనాల వల్ల తెలుస్తోంది. కొండవీడు చుట్టుపక్కల చాలా పురాతన ఆలయాలను నేటికీ సందర్శించుకోవచ్చు. కొండ మీద ఉన్న కోటకు వెళ్లే మార్గంలో అరుదైన వెన్నముద్ద శ్రీకృష్ణ ఆలయం ఉంది. ఇది విజయనగర రాజుల కాలంలో నిర్మించబడింది.

రెడ్డి రాజుల తరువాత కొండవీడు విజయనగర రాజుల అధీనంలోకి వెళ్లింది. వారి నుండి ఫ్రెంచ్‌వారు, చివరగా ఆంగ్లేయులు కొండవీడు కోట మీద ఆధిపత్యం వహించారు.

ఆంగ్లేయులకు మరింత సౌకర్యవంతమైన ప్రదేశం లభించడంతో అక్కడికి తరలిపోయారు. అది నేటి విజయవాడ సమీపంలోని కొండపల్లి. ఈ కోట కూడా రెడ్డి రాజులు నిర్మించినదే కావడం విశేషం.

ఆంగ్లేయులు వదిలేసిన తరువాత కొండవీడు కోట క్రమేణా తన గత వైభవాలను నెమ్మదిగా కోల్పోయిందని చెప్పవచ్చు.

కొండవీడు కోట

ఒకప్పుడు అంటే సుమారు ముప్ఫై సంవత్సరాల క్రితం కొండపైకి వెళ్లాలంటే నడిచి ఎక్కవలసి వచ్చేది. అదొక అద్భుత అనుభూతి. ప్రస్తుతం చక్కటి రహదారి ఏర్పాటు చేశారు. ఈ మలుపుల దారిలో వాహనంలో శిఖరానికి చేరుకోవడం మరో విధమైన అనుభూతిని, ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.

గమనిస్తే నాటి నిర్మాణ గొప్పదనం నేటికీ అంటే ఏడు వందల సంవత్సరాల తరువాత కూడా కోట ప్రహరీగోడ పటుత్వం ఆశ్చర్యం కలిగిస్తుంది. పరాయి పాలకుల దాడులలో నష్టం జరిగినా, కొన్ని దశాబ్దాల పాటు నిర్లక్ష్యానికి గురైనా ఆ నిర్మాణాలలో మునుపటి బలం, దర్పం నేటికీ స్పష్టంగా కనిపించడం నాటి పాలకుల ముందు చూపుకు, శిల్పుల గొప్పదనాన్ని నిదర్శనంగా చెప్పుకోవాలి.

కొండవీడు కోటలో మరో గొప్ప విశేషం కనిపిస్తుంది. నీళ్ల మానవ మనుగడకు తప్పనిసరి. అయితే రాళ్ల గుట్టలతో నిండిన కొండ మీద నీళ్లు ఎక్కడి నుండి లభిస్తాయి?

దానికి నాటి నిపుణులు ఒక గొప్ప పరిష్కారాన్ని కనుగొన్నారు.

మూడు పెద్ద చెరువులను కోటలో తవ్వారు. ఊట, వర్షపు నీటితో నిండిన ఈ చెరువులు శత్రువులు కోటను పూర్తిగా చుట్టుముట్టి నెలల తరబడి నిర్బంధం చేసినా లోపలివారి నీటి అవసరాలను తీర్చేవి.

నేటికీ ఈ చెరువులలో నీటిని చూడవచ్చు. ఇంకా ఎన్నో శిథిల గృహాలు, బురుజులు, వంపులు తిరుగుతూ సాగిన కోటగోడ...

ఇవన్నీ ఆ కాలపు వైభవాన్ని మన కనుల ముందు నిలుపుతాయి. కొండపై నుండి చూస్తే పొలాలు వాటి మధ్య బొమ్మల కొలువులాగా కనిపించే పల్లెలు, జోరుగా వీచే స్వచ్ఛమైన గాలి, గతంలో మహారాజులు, మహాకవి పండితులు, మహావీరులు నడయాడిన ప్రదేశంలో నెలకొన్న గంభీరత సందర్శకులను మైమరపిస్తాయి.

కొండవీడు పక్కన పుట్టకోట మీద శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, అమీనాబాదులో రెడ్డి రాజుల కులదైవం శ్రీ మూలాంకులేశ్వరి అమ్మవారి సన్నిధి, సమీపంలోని వేములూరిపాడు గ్రామంలో పదవ శతాబ్దానికి చెందిన చోళరాజుల నిర్మిత శ్రీ జలపాలేశ్వర స్వామి కోవెల, గురువుకొండలో శ్రీ ఆంజనేయస్వామి మందిరం, చెంఘిష్‌ఖాన్‌పేటలో వెన్నముద్ద శ్రీకృష్ణుని ఆలయం, కోటకు వెళ్లే దారిలో కత్తుల బావి, రెడ్డిరాజుల మ్యూజియం చూడాల్సినవి.

రాష్ట్ర పురావస్తు శాఖవారు ప్రస్తుతం పురాతన శిథిల నిర్మాణాలను పునరుద్ధరించడంతో పాటు నూతన నిర్మాణాలను చేపట్టడం కొండవీడు కోటకు మరోసారి పునర్వైభవాన్ని తేవడమే!

కస్తూరి మురళీకృష్ణ

ప్రత్యుపకారం నిష్ఫలం

ఆది శాస్త్ర జేతవనంలో విహరిస్తున్న కాలం.

ఆ సమయంలో భిక్షువులతో ప్రసంగిస్తూ, దేవదత్తుడి కృతఘ్నత గురించి చెప్పారు.

"దేవదత్తుడు ఇప్పుడే కాదు, పూర్వం కూడా కృతఘ్నుడే" అన్నారు.

భిక్షువులందరికీ ఆ పూర్వ గాథ వినాలన్న కుతూహలం కలిగింది. వారు కుతూహలాన్ని వ్యక్తం చేశారు.

వారి అభ్యర్థనను మన్నించి శాస్త్ర పూర్వగాథను చెప్పటం ప్రారంభించాడు.

....

బ్రహ్మదత్తుడు వారణాసిలో రాజ్యం చేస్తున్న కాలం అది.

ఆ సమయంలో బోధిసత్త్వుడు హిమాలయ ప్రదేశంలో 'చిరతపక్షి' కడుపులో పుట్టాడు. ఒకరోజు ఒక సింహం జంతువును చంపి మాంసం తినేటప్పుడు ఓ ఎముక దాని గొంతులో గుచ్చుకుంది. అక్కడ చిక్కుబడిపోయింది. "ఫలితంగా దాని గొంతు వాచిపోయింది. గొంతు వాచిపోవటంతో అది ఆహారం స్వీకరించలేకపోయింది.

ఆహారం స్వీకరించలేకపోవటంతో బలహీనమైపోయింది. ఓ వైపు గొంతులో బాధ, మరోవైపు బలహీనమైపోవటంతో అల్లల్లాడిపోయింది సింహం.

సింహం బాధను చెట్టుపై నుండి పక్షి గమనించింది. ఉండబట్టలేక అడిగింది.

"ఏమిటీ బాధ?"

జరిగింది తెలిపింది.

పక్షి జాలి చూపించింది. "నీ బాధ నుంచి నేను నిన్ను విముక్తం చేయగలను. కానీ నాకు భయం వేస్తోంది".

"ఎందుకు భయం?"

"నేను ఎముకను నీ గొంతులోంచి లాగాలంటే నీ నోట్లోకి ప్రవేశించాలి. కానీ నీ నోట్లో అడుగు పెట్టాలంటే భయంగా ఉంది. నీ నోట్లోకి ప్రవేశించగానే నువ్వు నోరు మూస్తే?"

"భయం లేదు. గొంతులో ఎముక అడ్డు పడి బతకలేక... చావలేక ఏడుస్తున్నాను. అలాంటిది ఎముకను గొంతులోంచి తీయగానే నిన్ను తింటానా? భయపడకు. నా ప్రాణాలు కాపాడు.. నన్ను రక్షించు" అని బతిమిలాడింది సింహం.

పక్షి ఆలోచించింది. సింహం నోరు మూయకుండా దాన్ని పడుకోమని, నోరు తెరిపించి, పై పెదవి, కింది పెదవికి మధ్య ఒక కర్ర నుంచింది. కర్ర వల్ల పక్షి నోట్లో ఉన్నప్పుడు సింహం నోరు మూయలేదు.

పక్షి వేగంగా సింహం నోట్లో దూరి ఎముకను లాగింది. దాని నోట్లోంచి బయటకు పోతూ కర్రను తన్ని ఎగిరిపోయింది.

సింహం ఆరోగ్యం బాగయింది. మళ్లీ అది వేటాడటం ఆరంభించింది. సింహాన్ని పరీక్షించాలని పక్షికి అనిపించింది. సింహం ఓ జంతువును చంపి తింటున్నప్పుడు చెట్టు మీద నుంచి అడిగింది.

"ఓ మిత్ర సింహమా, నాకు బాగా ఆకలేస్తోంది. నువ్వు తిని నాకు కొంచెం మిగల్చవా?"

సింహం తలెత్తి కూడా పక్షి వైపు చూడలేదు.

"నేను కష్టపడి వేటాడేను. నీకెందుకియ్యాలి కొంత భాగం? నా నోట్లో అడుగు పెట్టిన నిన్ను ప్రాణాలతో వదిలిపెట్టటమే గొప్ప" అంది.

అది విని సింహంతో అంది "ఎవరికైనా ఉపకారం చేస్తే వాడు ప్రతిగా తాము ఉపకారం చేసిన వాడికి సహాయం చేస్తే ఆ సహాయం నిష్ఫలం. కానీ ఉపకారం చేసిన వాడికి అపకారం చేసేవాడి మీద క్రోధం ఉండకూడదు. అలాంటి వాడికి దూరంగా వెళ్లిపోవాలి" అని పక్షి ఎగిరిపోయింది.

ఈ కథ ముగించి శాస్త్ర "ఆ కాలంలో ఆ కృతఘ్నత ప్రదర్శించిన సింహం దేవదత్తుడు, పక్షి నేనే" చెప్పాడు.

....

శాస్త్ర జేతవనంలో విహరిస్తున్న కాలం అది.

ఒకరోజు భిక్షువుల నడుమ చర్చ వచ్చింది. వారి మధ్య వున్న శాస్త్ర వారికి షడ్వర్గీయ భిక్షువుల గురించి చెప్పాడు.

....

ఒకరోజు శాస్త్ర షడ్వర్గీయ భిక్షువులను పిలిచాడు.

"భిక్షువులారా, మీరు కింది పీఠముల మీద కూర్చుండి, పైన ఉన్నత పీఠముల మీద కూర్చున్న వారికి ధర్మోపదేశం చేస్తున్నారట. ఇది నిజమేనా?" అడిగాడు.

"నిజం"

"భిక్షువులారా, ఇది ధర్మాన్ని అవమానించినట్టే అవుతుంది. కింద ఆసనాల మీద కూర్చుని ఉన్నతాసనాల మీదున్న వారికి బోధించటం అభినందనీయం" అన్నాడు.

తమకు ఆ విషయాన్ని వివరించమని భిక్షువులు వేడుకున్నారు.

శాస్త్ర వారికి ఆ కథ చెప్పటం ప్రారంభించాడు.

....

వారణాసిలో బ్రహ్మదత్తుడు రాజ్యం చేస్తున్న కాలమది.

ఆ సమయంలో బోధిసత్త్వుడు చండాల కులంలో జన్మించాడు. అతనికి వివాహం అయింది.

ఒకరోజు అతని భార్య తాము మామిడి పళ్ల తినాలన్న కోరిక కలిగిందని చెప్పింది. నాకు మామిడి పళ్ల తినాలని ఉంది, తీసుకురండి" అంది.

"ఇది మామిడిపళ్ల పండే కాలం కాదు. ఒకవేళ పొరపాటున దొరికినా అవి తియ్యగా ఉండవు. పుల్లగా ఉంటాయి" అన్నాడు.

"నాకు తియ్యటి మామిడి పండే కావాలి. అది తినకపోతే నా ప్రాణాలు పోతాయి.

నేను ప్రాణాలతో ఉండాలంటే నాకు మామిడిపళ్లు తెచ్చివ్వండి. లేకపోతే నేను చచ్చిపోతాను" అంది.

ఆమె నిజంగానే మామిడి పండును వాంఛిస్తున్నదనీ, అది తెచ్చివ్వకపోతే ఆమె ప్రాణాలు పోతాయనీ అతడు గ్రహించాడు.

ఈ సమయంలో మామిడిపండ్లు ఎక్కడ దొరుకుతాయా? అని ఆలోచించాడు.

అంతలో అతనికి గుర్తుకు వచ్చింది.

వారణాసి రాజుకు చెందిన పళ్లతోటలో ఎప్పుడూ మామిడిపండ్లు ఉంటాయని అతడిని గుర్తుకు వచ్చింది.

రాజు తోటకు వెళ్లి మామిడిపళ్లు తెచ్చిస్తే ఆమె ప్రాణాలు నిలుస్తాయని భావించాడు. కానీ రాజు తోటలో ఎవరికీ ప్రవేశం లేదు. అందుకని అర్ధరాత్రి దొంగతనంగా రాజు తోటలోకి ప్రవేశించాడు.

చీకటిలో అతడికి మామిడిపండ్లు కనబడలేదు.

ఒక చెట్టు నుంచి మరో చెట్టుకు శాఖలను వెతుకుతూ వెతుకుతూ వెళ్తూనే ఉన్నాడు.. తూర్పున వెలుగురేఖలు పొడచూపాయి.

తోటలో రాజభటుల కదలిక మొదలయింది.

"అమ్మో... ఇప్పుడు రాజభటుల కంట పడితే నన్ను దొంగ అనుకుంటారు. పట్టుకుని కారాగారంలో బంధించి, కొరడాలతో కొడతారు. కాబట్టి వీళ్లకు కనబడకుండా చెట్టుకొమ్మల్లోనే దాక్కుంటాను. రాత్రికి గుట్టుచప్పుడు కాకుండా జారుకుంటాను" అనుకుని, వారికి కనబడకుండా చెట్టుకొమ్మల్లో దాక్కున్నాడు.

తెల్లారేసరికి వారణాసి రాజు ఆ చెట్టుకింద ఉన్నతాసనం వేయించుకుని కూర్చున్నాడు.

మంత్రాలు చదువుతూ పురోహితులు ఆయన చుట్టూ ఉన్నారు. ఆచార్యుడు ఆయన ఎదురుగా పీఠంపై కూర్చున్నాడు.

వృక్షంలో దాక్కున్న బోధిసత్త్వుడు కింద జరుగుతున్నదాన్ని చూశాడు.

"ఈ రాజు ధర్మం పాటించటం లేదు. తాను ఉన్నతాసనంలో కూర్చుని, మంత్రోపదేశం పొందుతున్నాడు. ఈ గురువు ధార్మికుడు కాదు. తాను చిన్న పీఠంపై కూర్చుని ఉన్నతాసనంపై ఉన్న రాజుకు ధర్మోపదేశం చేస్తున్నాడు. నేను కూడా ధార్మికుడిని కాను. భార్య కోరిక తీర్చటం కోసం ప్రాణాలను పణంగా పెట్టి ఫలాలు దొంగిలించాలని వచ్చాను" అనుకున్నాడు.

కొమ్మ దిగి వచ్చాడు.

మహారాజు ఎదురుగా నిలబడి స్పష్టంగా, నిర్భయంగా చెప్పాడు.

"మహారాజా, నేను భ్రష్టుడిని, నువ్వు మూర్ఖుడివి. ఈ బ్రాహ్మణుడు నష్టుడు" అన్నాడు.

"ఎందుకని?" అడిగాడు రాజు.

"మహారాజా, నేను భ్రష్టుడిని, నువ్వు మూర్ఖుడివి. ఈ బ్రాహ్మణుడు నష్టుడు" అన్నాడు.

"ఎందుకని?" అడిగాడు రాజు.

"మీ ఇద్దరిలో ధర్మం లేదు. గురువు కన్నా శిష్యుడు ఉన్నతాసనంలో కూర్చున్నాడు. శిష్యుని కన్నా తక్కువ ఆసనంలో కూర్చుండి ధర్మబోధ చేస్తున్నాడు గురువు. కాబట్టి మీరిద్దరూ ధర్మపథం నుండి భ్రష్టులయ్యారు. నేను భార్య కోసం భ్రష్టుడిని అయ్యాను. కర్మఫలం అనుభవించక తప్పదు. దుష్ట కర్మ వల్ల దొరికిన ధనం తగదు. కుండ రాయిని పగులగొట్టినట్టు, చెడు కర్మ చెడు ఫలితం ఇస్తుంది" అన్నాడు.

రాజుకు అతని ధార్మికపు ఆలోచనలు నచ్చాయి.

అతని వివరాలు కనుక్కుని వదిలేశాడు.

మరుసటి రోజు రాజదూత అతడి ఇంటికి వచ్చాడు.

"రాజా, తమకు పురోహిత పదవిని ఇవ్వాలని నిశ్చయించుకున్నారు. మీరు రాజసభకు రావాలి" విన్నవించాడు.

"పురోహిత పదవి నాకు వద్దు. నేను అక్కడికి రాను. నాకు రాజ్యం మొత్తం ఇచ్చినాసరే నేను రాను. ఒకసారి వదలిపెట్టిన తరువాత మళ్లీ స్వీకరించటం తగదు. త్యజించినదాన్ని మళ్లీ ఎవరైనా స్వీకరిస్తారా? ధర్మ వ్యతిరేకమైన దారిలో వెళ్లి ఒడించటం కంటే భిక్షమెత్తుకుని జీవించటం మేలు. నింద్యామార్గంలో ప్రయాణించటం కన్నా ఆకులు అలములు తింటూ బతకటం మేలు. ఈ ప్రపంచంలో దేన్నయినా హింసించటం కంటే సర్వం వదలి ప్రవ్రజించటం మంచిది. నాకు రాజ్యాలు వద్దు" అన్నాడు.

రాజదూత ఎంతగా ప్రార్థించినా బోధిసత్త్వుడు రాజ పురోహిత పదవి స్వీకరించేందుకు అంగీకరించలేదు.

చివరికి రాజదూత అలసిపోయాడు. బోధిసత్త్వుడికి ప్రణామం చేసి వెళ్లిపోయాడు. తిన్నగా రాజు దగ్గరకు వెళ్లి "ఎంతగా బతిమిలాడినా ఆయన అంగీకరించటం లేదని" చెప్పాడు.

జరిగిన కథంతా చెప్పిన శాస్త చివరలో అన్నాడు "ఆ కాలంలో రాజు ఆనందుడు. అతను పంపిన దూత సారిపుత్రుడు, పురోహితపు తండ్రిని నేనే".

....

అది శాస్త జేతవనంలో విహరిస్తున్న కాలం. ఆ కాలంలో ఆయన మహా మౌద్గల్యాయనుడి గురించి చెప్పాడు.

....

స్థవిర మహామౌద్గల్యాయనుడు రాజగృహానికి దగ్గరలో ఉన్న అరణ్యంలోని కుటీరం నిర్మించుకుని నివసించేవాడు. ఒకరోజు ఓ దొంగ, ఇంట్లో దొంగతనం చేశాడు. రాజభటులు తరుముతుంటే పారిపోయి మౌద్గల్యాయనుడి ఆశ్రమానికి వచ్చాడు. అతడు క్షేమంగా ఉండవచ్చనుకున్నాడు.

కానీ దొంగలకు ఆశ్రయం ఇవ్వటం క్షేమకరం కాదని మౌద్గల్యాయనుడు అతడిని కుటీరం వదలి వెళ్లిపొమ్మన్నాడు.

దొంగ వెళ్లిపోతూ అక్కడి నుండి తన కాలిముద్రలు చెరిపివేశాడు.

కాసేపటికి ఊళ్లోవాళ్లు దొంగ కాలిగుర్తులు వెతుకుతూ కుటీరానికి వచ్చారు. వారికి దొంగ కుటీరం వదిలి వెళ్లిన ఆనవాళ్లు లభించలేదు. అటూ ఇటూ తిరిగి వాళ్లు వెళ్లిపోయారు.

వెంటనే మౌద్గల్యాయనుడు ఈ విషయం శాస్తకు చెప్పాడు.

"ఇప్పుడే కాదు, పూర్వం కూడా నిన్ను ఎవ్వరూ శంకించలేదు. పురాణ పండితులు మాత్రం శంకించారు" అన్నాడు. ఆ పూర్వ గాథ వినాలని మౌద్గల్యాయనుడు, ఆ గాథ చెప్పమని శాస్తను అభ్యర్థించాడు. శాస్త ఆ కథ చెప్పటం ఆరంభించాడు.

(ఇంకా ఉంది)

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్: 9885446501/9885449458

బకాయిలు వసూలు కావాలంటే?

ఎ.వాసుకి –
హన్మకొండ

ప్రశ్న: మనకి రావాల్సిన డబ్బులు రావాలంటే ఏం చేయాలి?

జవాబు: సమయానికి డబ్బులు చేతికందకుండా బాధపడుతున్నవాళ్లు ఎంతోమంది ఉంటారు. 'ఫైనాన్స్' బిజినెస్ చేసేవాళ్లు, 'చిట్‌ఫండ్' బిజినెస్ చేసేవాళ్లు, వ్యాపార పరంగా ఇతరులకు లేదా క్లైంట్లకు ఇచ్చిన డబ్బులు సమయానికి తిరిగిరాక బాధపడుతూ ఉంటారు. మన ఉద్యోగంలో ఇవ్వాల్సిన బోనసులు కానీ, ఇంక్రిమెంట్లు కానీ, రావాల్సిన ప్రమోషన్లు సమయానికి రాక బాధపడుతూ ఉండేవాళ్లు ఉంటారు. ఎక్కడి నుండో డబ్బులు రావలసి ఉంది, చేతికి అందకుండా బాధపడుతున్నవాళ్లు ఉంటారు.

ఏ విధంగానైనా సరే మీకు డబ్బులు రావాల్సి వుండి కూడా అవి అందటం లేదనుకోండి.. దానికోసం ఈ 'చిట్కా' అమలు చేయండి. డబ్బులు చేతికి వస్తాయి. ఒక్కొక్కసారి మనకి డబ్బులు అవసరం అవుతాయిగానీ డబ్బులు వచ్చే మార్గం ఉండదు, కనపడదు. ఆదాయ వనరులు కూడా వుండవు.

కానీ డబ్బులు కావాలి. ఏం చేయాలో తోచడం లేదు. ఇప్పుడు రావాల్సిన డబ్బులు ఏమీ లేవు. ఇటువంటి పరిస్థితుల్లో కూడా ఈ ఒక్క చిన్న చిట్కా మీరు పాటించి చూడండి. డబ్బులు వస్తాయి. అంటే డబ్బులు వచ్చే మార్గం సుగమం అవుతుంది. డబ్బులు కూడా చేతికి అందవచ్చు. నమ్మకంగా చేయండి.. చిట్కా మీరు పాటించి చూడండి. మీకు ఏదో విధంగా డబ్బులు అందే మార్గం లేదా సంపాదించుకునే మార్గం సుగమం అవుతుంది. డబ్బులు కూడా చేతికి అందవచ్చు. నమ్మకంగా చేయండి.

అదేమిటంటే– ఏదైనా మంగళవారంనాడు కానీ శనివారంనాడు కానీ ఈ పని చేయాలి. మీరు ప్రస్తుతం ఉంటున్న 'ఇంటివాస్తు' విషయం ఎలా ఉన్నప్పటికీ ఇంటిలోపల శుభ్రంగా ఉందా? లేదా? చూసుకోండి. ఇల్లంతా ఊడ్చినా, శుభ్రం చేసినా, దులిపినా కూడా ఎంతో కొంత దుమ్ము మిగిలిపోతూ ఉంటుంది. వీలైనంత వరకు శుభ్రం చేసుకునే ప్రయత్నం చేయండి. ఇప్పుడు విషయానికి వద్దాం...

వారంలో ఒక్కరోజు ఈ పని చేయవలసి ఉంటుంది. మంగళవారంనాడు కానీ శనివారంనాడు కానీ పొద్దున్న స్నానం చేయడానికి ముందు ఈ కార్యక్రమం పెట్టుకోండి.

ఇంటిలోపల ఈశాన్య మూలన కానీ, ఇంటి బయట కాంపౌండ్ వాల్ ఈశాన్యం మూలన తప్పకుండా అపరిశుభ్రం లేదా బూజు పట్టి ఉంటుంది. గమనించండి. శుభ్రం చేయండి. ఇంటి లోపల ఉన్న మొత్తం బూజు అంతా దులిపితే మరీ మంచిది.

ఈ పనికి మీరు అనుకున్నంత ఎక్కువ సమయం పట్టదు. తక్కువ సమయమే పడుతుంది. ఈ పనిని పనివాళ్లకి ఎవరికైనా పూరమాయించినా సరిపోతుంది. మంగళవారం లేదా శనివారం ఏదో ఒక్కరోజు చేసినా చాలు. రెండేసి రోజులు చేయవలసిన అవసరం ఉండదు.

ఇదేమీ కొత్త విషయం కాదు. మన పెద్దవాళ్లు ఈ విషయం ఎప్పటి నుంచో చెప్తూ వస్తున్నారు. క్రమంగా అదృశ్యమైపోయిన అనేక సంప్రదాయ పద్ధతుల విషయాలలో ఇది కూడా ఒకటి అయిపోయింది.

ఇంటిలోపల ప్రత్యేకించి ఈశాన్యం మూలలో కానీ, ఇతర మూలల్లో కానీ, కాంపౌండ్ వాల్సు, మూలలలో కానీ, గోడలకు కానీ ఇటువంటి దుమ్ము, ధూళి, సాలెగూడులు, ఇతర కీటకాల గూళ్లు లేకుండా జాగ్రత్త పడండి. తప్పకుండా ఫలితం ఉంటుంది. మీకు మంచి ఫలితం కనపడితే అక్కడితో ఆగకుండా ఇతరులకు కూడా చెప్పండి. దానివల్ల వాళ్లకు అభివృద్ధి కలగడంతో పాటు, ఆ పుణ్యం వలన మీకు కూడా అభివృద్ధి ఉంటుంది. అది మర్మం. చాలా చిన్న పని. చేసి చూస్తే కానీ అర్థం కాదు.

వాస్తువిద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు...

పుట్టినతేదీ : .... ఊరు : ....

జన్మ నక్షత్రం: ....తల్లి పేరు: ....

చిరునామా: ....

వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

మేషం

విలువైన వస్తువులు, ఆభరణాలు, నూతన వస్త్రాలు కొనుగోలు చేస్తారు. కొన్ని పాత వస్తువులను మారుస్తారు. వస్త్ర వ్యాపారస్తులకు, బంగారం వ్యాపారస్తులకు కాలం అనుకూలంగా ఉంది. జిల్లేడు వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. ఆటంకాలన్నీ తొలగిపోతాయి. కోర్టు వ్యవహారాలు అంతంత మాత్రంగానే ఉంటాయి.

వృషభం

దూర ప్రాంత ప్రయాణాలు కలసి వస్తాయి. వాహనాలు అమ్మకాలు-కొనుగోలు విషయంలో అనుకూలంగా ఉంటుంది. ట్రావెల్స్ వారికి కాలం బాగుంటుంది. రియల్ ఎస్టేట్ వారికి లాభదాయకం. దైవ చింతన కలిగి వుంటారు. ఆధ్యాత్మిక కేంద్రాల పట్ల ఆకర్షితులవుతారు. గురువుల సమక్షంలో కొన్ని నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

మిథునం

రాత్రింబవళ్లు కష్టపడి ఒక ప్రాజెక్టుని సమయానికి నిలబెడతారు. ప్రయోజనాలు దక్కించుకుంటారు. నూతన ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. సిద్ధ గంధంతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి అర్చన జరిపించండి. అయినవాళ్లతో సంబంధం వెతుక్కోవాలన్న ఆలోచనలు అంతగా ఉపయోగపడకపోవచ్చు. శుభ వార్తలు వింటారు.

కర్కాటకం

కార్యాలయంలో ఎవరో చేసిన తప్పు మీ తలకి చుట్టుకోవడం బాధాకరమైన అంశంగా మారుతుంది. జరుగుతున్న కుట్రలు, కుతంత్రాలు గమనిస్తారు. మీకు అండగా నిలబడే వారిని మీ వైపుకి తిప్పుకుంటారు. సౌర కంకణాన్ని ధరించండి. ఆరోగ్యం మెరుగు పడుతుంది. సాక్ష్యాధారాలతో సహా అసత్య ప్రచారాలు, నిందలను రూపుమాపుకుంటారు.

సింహం

ప్రేమ వివాహం పట్ల మీకున్న అభిప్రాయం ఇంట్లో వున్నవారు ఏకీభవించకపోవచ్చు. కొన్ని సందర్భాలలో వాళ్లను ఒప్పించలేక మీరు బాధ పడటం, కొన్ని కీలకమైన నిర్ణయాలు తీసుకోవాల్సి పరిస్థితులు సంభవిస్తాయి. ప్రతిరోజూ దేవి దేవతలకు ప్రథమ తాంబూలం సమర్పించండి. జీవిత భాగస్వామి అలవాట్ల పట్ల ఆందోళన చెందుతారు. కొత్త రుణాలు చేస్తారు.

కన్య

ట్రావెల్స్ వ్యాపారస్తులకు కాలం అనకూలంగా వుంటుంది. నూతన గృహోపకరణాలను కొనుగోలు చేస్తారు. ప్రింట్ మీడియాలో వున్నవారికి కాలం కలిసి వస్తుంది. కళాకారులకు, రచయితలకు బాగుంటుంది. క్రీడా రంగంలో వున్నవారికి అనుకూలం. విదేశాలకు వెళ్లి కొన్ని ప్రతిష్టాత్మకమైన పోటీలలో పాల్గొంటారు, విజయం సాధిస్తారు.

తుల

కోర్టు వ్యవహారాలు, తీర్పులు వాయిదా పడతాయి. దూర ప్రాంత ప్రయాణాలు కలిసి వస్తాయి. ఆహార నియమాలు కచ్చితంగా పాటించండి. టైఫాయిడ్, డయేరియా సంబంధమైన అనారోగ్యాలు వచ్చే అవకాశాలున్నాయి. జీవిత భాగస్వామికి విలువైన ఆభరణాలు బహుమతిగా ఇస్తారు. సౌర కంకణం ధరించండి. స్త్రీ సంతానం పట్ల శ్రద్ధ కనబరుస్తారు. వాళ్ల భవిష్యత్తును ఏ విధంగా తీర్చిదిద్దాలన్న ఆలోచనలు ఉంటాయి.

వృశ్చికం

నూతన స్వగృహం/ప్లాట్లు కొనుగోలు చేస్తారు. మానసిక సంతోషం కలిగి వుంటారు. సంతాన సంబంధమైన మంచి విషయాలను తెలుసుకుంటారు. శుభ వార్తలు వింటారు. విదేశీ ద్రవ్యం చేతికి అందుతుంది. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. నూతన పెట్టుబడులు లాభదాయకం. సినిమా రంగంలో ప్రవేశించాలన్న ఆలోచనలు కలిసి వస్తాయి. సంగీతం పట్ల మక్కువ కనబరుస్తారు.

ధనుస్సు

సాంకేతిక విద్య, బిజినెస్ మేనేజ్‌మెంట్ నేర్చుకోవాలన్న ఆలోచనలు ముడిపడతాయి. ఆర్థిక స్థోమత లేనివారికి ప్రభుత్వం ఆసరాగా నిలబడుతుంది. అనుకున్న ఉన్నత చదువులను చదువుకోగలుగుతారు. గోమతీ చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరం చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడడానికి చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. గృహ నిర్మాణ ఆలోచనలు పునః ప్రారంభిస్తారు.

మకరం

మెకానిక్‌లకు, టైలరింగ్ వారికి కాలం అనుకూలం. వస్త్ర వ్యాపారులకి బాగుంటుంది. వ్యాపారాన్ని విస్తరింపచేయడం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. గోడౌన్/షాపుని లీజ్‌కు తీసుకోవాలన్న ఆలోచనలు ఉపకరిస్తాయి. ఓం నమశ్శివాయ వత్తులు, అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. పెద్ద సంస్థలతో పరిచయాలు, సత్సంబంధాలు కలిగి వుంటారు. నూతన వ్యాపార ఉత్పత్తులను తయారు చేస్తారు.

కుంభం

సౌందర్య సాధనాల పట్ల ఆకర్షితులవుతారు. ఏదో ఒక విధంగా ఆకర్షణగా వుంటేనే ఉద్యోగం స్థిరంగా ఉంటుందని అనుకుంటారు. స్నేహితుల ద్వారా ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. మానసిక ధైర్యం, సంతోషం తిరిగి సంపాదించుకుంటారు. పెద్ద మనుషుల సలహాలు, సూచనలు మేరకు చేసే ఆలోచనలు ముఖ్యమైన మార్పులకు కారణమవుతాయి.

మీనం

కొంతమందితో ఎన్ని అభిప్రాయ భేదాలున్నప్పటికీ పిల్లల భవిష్యత్తుని దృష్టిలో వుంచుకొని తాత్కాలికంగా కలిసి వుంటారు. మీకు ఏమాత్రం సంబంధం లేని విషయాలలో మీ పేరుని ప్రస్తావిస్తారు. మెడలో శ్రీ మేధా దక్షిణామూర్తి డాలరు ధరించండి. శత్రువర్గంతో సమస్యలు తలెత్తుతాయి. కొన్ని సందర్భాలలో వీళ్లని శాశ్వతంగా వదిలించుకోవాలన్న ఆలోచనలు వస్తాయి. ఇలాంటి వాళ్ల గురించి సమయం వృధా చేసుకోకండి.

ఈ వారం కా'ర్టూన్స్'


ఇది ఇక్కడ కట్టిన బ్రిడ్జి కాదు.. మొన్నటి వానలకు
ఎక్కడి నుండో కొట్టుకొచ్చి ఈ రెండు గ్రామాలను కలిపింది!!
Zakir...


కొత్తగా యూట్యూబు ఛానల్ పెట్టాను..
'సబ్‌స్క్రైబ్' చేయండి బాబయ్యా.. ప్లీజ్!!
Zakir...

మా విల్లాలు మునగడం కాదు..
చెరువు తిరిగి వచ్చింది..!!
Zakir...

నీటిపై
తేలియాడే ఈ వంతెనను
చైనాలోని షిజిగువాన్ ప్రావిన్స్‌లోని
లోయలో ప్రవహించే నదిపై నిర్మించారు.
దీనిని చూడడానికి పర్యాటకులు అధిక
సంఖ్యలో వస్తుంటారు.
చైనాలోని నైరుతి హుబీ ప్రావిన్స్‌లోని జువాన్
కౌంటీలో ఉన్న షిజిగువాన్ ఫ్లోటింగ్ బ్రిడ్జి
పర్యాటక ప్రాంతాల్లో ఒకటని
చెప్పవచ్చు.